
# జనబలం

ప్రజలే ప్రభువులు

మే 2023 లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక రూ.10/-





## మోదీ - పార్టీ ఫిరాయింపులు - రాజకీయ సంస్కరణలు






## వైద్యులుగా గర్వించదగ్గ స్థాయికి ఎదిగారు.. సమాజం గురించి కొంతయినా పట్టించుకోండి : జేపీ




హైదరాబాద్ కాచిగూడలో బద్రుకా కళాశాల పీజీ సెంటర్ స్నాతకోత్సవంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా॥ జయప్రకాష్ నారాయణ్










ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


సంపుటి 25 సంచిక 5

మే 2023

సంపాదకవర్గం
**బండారు రామ్మోహనరావు**
**శిరమని నరేష్**

వర్కింగ్ ఎడిటర్
**దూసనపూడి సోమసుందర్**


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

## కార్టూన్ కార్నర్




థర్డ్ డిగ్రీ ప్రయోగించినా నోరు మెదపట్లేదు సార్! మండుతున్న ఈ ఎండల్లో కాసేపు నిలబెడదాం.. దెబ్బతో నిజం కక్కుతాడు!!


కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్ట్స్, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949
Email: accountsdept@loksatta.org

# అధిక జనాభా- అపార అవకాశాలు

సంపాదకీయం

ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన అగ్రదేశంగా భారత్ ఆవిర్భవించింది. ఇప్పటి వరకూ అగ్రస్థానంలో ఉన్న చైనాను భారతే అధిగమించింది. ఐరాసకు చెందిన జనాభా నిధి సంస్థ తాజాగా ప్రకటించిన గణాంకాల ప్రకారం చైనాలో జనాభా 142.57కోట్ల మంది కాగా, భారత్‌లో 142.86 కోట్ల మంది ఉన్నారని వెల్లడయ్యింది. జనాభావృద్ధి విషయంలో 2022 నాటికి చైనా శిఖరాగ్రానికి చేరిపోయింది. ఇకముందు చైనాలో జనాభా వృద్ధిరేటులో తగ్గుదల క్రమం మొదలు కానున్నది. మరో ఎనబై ఏళ్ళలో చైనా జనాభా నూరు కోట్ల దిగువకు చేరుతుందని జనాభా శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. రానున్న పాతికేళ్ళలో భారత్‌లో జనాభా 164 కోట్లకు చేరుకుంటుందని, ఆ తర్వాత జనాభా వృద్ధిరేటు తగ్గుముఖం పడుతుందని శాస్త్రవేత్తలు అంటున్నారు.

" 800కోట్ల జీవితాలు - అనంతమైన అవకాశాలు" పేరిట ప్రపంచ జనాభా పరిస్థితిపై ఐరాస జనాభానిధి సంస్థ 2023 ఏప్రిల్‌లో ఒక నివేదికను విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా జనాభావృద్ధిలో కన్పిస్తున్న ధోరణులను ఆ నివేదిక విశ్లేషించింది. జనాభా పెరుగుదలతో ప్రపంచం ప్రమాదంలో పడిపోతుందని కలవరపడేవారూ ఉన్నారు. జనాభా తగ్గుదల వల్ల మానవజాల మనుగడకే ముప్పు ఏర్పడుతుందని సందేహించేవారూ ఉన్నారు. అయితే ఈ రెండు ధోరణులను ఖాతరు చేయాల్సిన అవసరం లేదని ఐరాస జనాభా నిధి సంస్థ తన తాజా నివేదికలో స్పష్టం చేసింది. దాంతో మరోసారి జనాభావృద్ధి ధోరణులపై ప్రపంచవ్యాప్తంగా చర్చ మొదలయ్యింది. మరో పాతికేళ్ళపాటు జనాభా విషయంలో అగ్రదేశంగా కొనసాగనున్న భారతలో కూడా జనాభావృద్ధి, దాని ధోరణులపై చర్చ జరగాల్సి ఉంది.

భారత్‌లో 1950 నాటికి సగటు ఆయుః ప్రమాణం 45.5 సంవత్సరాలు. 1930 నాటికి 63.4కు చేరిన ఈ సంఖ్య 2023 నాటికి 73.16కి పెరగ్గా 2050కి 77.2 కు చేరుతుందని అంచనా. సగటు ఆయుః ప్రమాణం పెరగడం వల్ల జననాల, మరణాల మధ్య నిష్పత్తి ప్రభావితం అవుతుంది. జనాభా నియంత్రణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకున్నంత మాత్రాన జనాభా తగ్గుదల అనివార్యంగా జరుగుతుందని చెప్పలేం! సగటు ఆయుః ప్రమాణం పెరగడం వల్ల జనాభావృద్ధి స్థిరీకరణ చెందుతుందని శాస్త్రవేత్తలంటున్నారు. సంతాన సాఫల్యతలో తగ్గుదల ప్రమాదం గురించి కొందరు ప్రస్తావిస్తున్నారు. 1950కి భారత్‌లో సంతాన సాఫల్యతా రేటు ఒక మహిళ ఐదుగురు బిడ్డలకు జన్మనిచ్చే 1:5గా ఉండేది. 2021 నాటికి 1:2.3గా నమోదై ఉంది. 2050 నాటికి 1:2.1గా తగ్గుతుందని అంచనావేస్తున్నారు. అయితే సంతాన సాఫల్యతా రేటు ప్రపంచవ్యాప్తంగా 2.1గా ఉంది.

ప్రపంచంలో మూడింట ఒకవంతు దేశాల్లో సంతాన సాఫల్యతా రేటు తగ్గుముఖం పట్టింది. యూరోపులో రానున్న ముప్పై ఏళ్ళలో జనాభా వృద్ధి మైనస్ 7 శాతంగా ఉంటుంది. చైనాలో కూడా సంతాన సాఫల్యతా రేటు 1.2గా ఉన్నది. దీంతో జనాభా తగ్గిపోతుందనే ఆందోళన వ్యక్తం అవుతోంది. అయితే మూడింట రెండు వంతుల దేశాల్లో సంతాన సాఫల్యత సానుకూల ప్రభావాన్ని చూపుతుందని శాస్త్రవేత్తలు అంచనావేస్తున్నారు. మధ్యాసియా, దక్షిణ, ఆగ్నేయాసియా, లాటిన్ అమెరికా, కరీబియన్, ఉత్తర అమెరికా దేశాల్లో జనాభా వృద్ధి- అంచనా, సంతాన సాఫల్యతరేటు 1970ల నాటికే తక్కువగా ఉన్న జనాభాలో పెద్దగా మార్పులు రాలేదని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అందుకు వలసలు ప్రధాన కారణమని పరిశోధకులు తెలిపారు. భారత మధ్యగత వయసు 25 కంటే తక్కువకు చేరుకోనున్నది. అంటే జనాభాలో సగం మంది 25 ఏళ్ళలోపు వయస్కులు ఉంటారన్నమాట. అలాగే 65 సంవత్సరాలు దాటిన వారి సంఖ్య రెట్టింపుపైగా ఉంటుంది. ఆయుః ప్రమాణం, సంతాన సాఫల్యత, కుటుంబ నియంత్రణ వంటి అంశాలు మన జనాభాని స్థిరంగా ఉంచుతాయని నిపుణులు అంటున్నారు. రానున్న కాలంలో వృద్ధుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది కాబట్టి జననాలను నియంత్రించే చర్యలు జనాభా స్వరూపంలో మార్పులు తెచ్చే అవకాశం ఉంది.

అన్ని సమస్యలకూ జనాభా పెరుగుదలే కారణమనే వాదనను 'ఐరాస జనాభా నిధి సంస్థ' తాజా నివేదిక అంగీకరించలేదు. పర్యావరణ కాలుష్యం, ఉద్గారాల విషయంలో కొనసాగుతున్న తప్పుడు భావనను నివేదిక ఎత్తిచూపించింది. ప్రపంచంలో వెలువడుతున్న ఉద్గారాలలో 50 శాతంపైగా పది శాతం జనాభా ఉన్న సంపన్న దేశాలనుండి వెలువడుతున్నాయని నివేదిక పేర్కొన్నది. వాతావరణ మార్పులకు జనాభా పెరుగుదల కారణమన్న వాదనతో సంపన్నదేశాలు ఉద్గారాల విషయంలో తమ బాధ్యతనుండి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు వెల్లడయ్యింది. పర్యావరణ సంక్షోభాన్ని నివారించడానికి సంపన్న దేశాలు తమ ఉద్గారాలను గణనీయంగా తగ్గించాలని శాస్త్రవేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

జనాభా సమస్యను చర్చించే సమయంలో పునరుత్పత్తి హక్కులు, బిడ్డల్నికనే విషయంలో మహిళలకు గల ఎంపిక స్వేచ్ఛ, వలసలు, పర్యావరణ కాలుష్యం, కర్బన ఉద్గారాలు, విద్య, ఆరోగ్యం, ఉపాధి, వంటి సమస్యలతో ముడిపెట్టి ఆలోచించాల్సి ఉంటుంది. పిల్లల్ని కనడానికీ, పిల్లల సంఖ్యను, పిల్లల మధ్య ఎడాన్ని నిర్ణయించుకోవడానికీ, పిల్లలను కనే సమయాన్ని ఎంచుకోవడానికీ మహిళలకు పూర్తి స్వేచ్ఛ ఉండాలి. లింగవివక్షను అంతం చేయడంలో మహిళల ఎంపిక స్వేచ్ఛ కీలకమైనదన్న అంశాన్ని గుర్తుంచుకోవాలి. జనాభా తక్కువ వాదనలు ముఖ్యం కాదు. మానవ మనుగడ కొనసాగించడంలో లైంగిక, పునరుత్పాదక స్వయం నిర్ణయాధికారం ముఖ్యమైనది. జనాభాను నియంత్రించడం కోసం ప్రభుత్వాలు చేపట్టే చర్యలు కొందరికి జన్మించే స్వేచ్ఛని ఇచ్చి, మరికొందరికి నిరాకరించడం మానవ హక్కులకే విఘాతం కల్పిస్తుంది. పునరుత్పత్తి హక్కులను నియంత్రించడంవల్ల ప్రయోజనంలేదని ఐరాస జనాభా నిధి సంస్థ స్పష్టంచేసింది. జనాభా నిరంతరం పరివర్తనలకు లోనవుతూనే ఉంటుందని, మార్పులకు లోనవుతున్న జనాభా అవసరాలను తీర్చే విధంగా సమాజాలను పునర్నిర్మాణం చేయడంపై దృష్టి సారించాలని నివేదిక సూచించింది.

వలసలు జాతీయ భద్రతకు ముప్పు కల్గిస్తాయన్న వాదనలు సంకుచితమైనవని, ఉన్నతాదాయాలు కలిగిన దేశాలలో జనాభా పెరుగుదలను, జనాభా స్థిరీకరణను వలసలు సానుకూలంగా ప్రభావితం చేస్తాయని నివేదిక పేర్కొన్నది. వలసలకు తాము కారకులు కాకపోయినా బాధితులు మాత్రం ప్రజలే అవుతున్నారు. సమస్యల పరిష్కారానికి అందర్నీ భాగ స్వాముల్ని చేయగల సమ్మిళిత సమాజాల నిర్మాణం కోసం కృషి జరగాల్సి ఉంది.


జనాభా పెరగడం వల్లనో, తగ్గిపోవడం వల్లనో సమాజాలు కుప్పకూలి పోతాయన్న జోస్యాలు సరైనవి కావని జనాభా శాస్త్రవేత్తలు అంటున్నారు. జనాభా మార్పులు మానవ మనుగడను కొనసాగించడమే కాకుండా, ఆ మనుగడ వర్ధిల్లడానికీ తోడ్పడతాయిని చరిత్రలో రుజువయ్యింది.

రానున్నరోజుల్లో జనాభా వృద్ధిరేటు పెరుగుదల చూపుతున్న భారత వంటి దేశాలలో విద్య, వైద్యం, నాణ్యమైన ఉపాధి, మహిళలు, బాలికల హక్కుల సంరక్షణ, వంటి అంశాలపై దృష్టి సారించాలి. ఆయా రంగాలపై పెట్టుబడులను పెంచాలి. వివక్షలను అంతం చేయడానికి, అందర్నీ భాగ స్వాములను చేయడానికి -సమ్మిళిత అభివృద్ధి సాధించడానికి గట్టి కృషి జరగాలి. జనాభా పెరుగుదల సమస్యను వివక్ష, ఘర్షణ, హింస, అసమానతకు తావులేని విధంగా పరిష్కరించేందుకు పూనుకోవాలి.

డి. సోమ సుందర్

# మోదీ - పార్టీ ఫిరాయింపులు - రాజకీయ సంస్కరణలు

2002 నుంచి 2022 ఆగస్టు వరకు ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) మొత్తం 5,422 కేసులు నమోదు చేయగా, వాటిలో 98 శాతం నరేంద్ర మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిదేళ్లలోనే నమోదయ్యాయి. అలాగే మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2014 నుంచి ఈ తొమ్మిదేళ్లలో ఈడీ నమోదు చేసిన కేసుల్లో 95 శాతం వరకు ప్రతిపక్ష నేతల మీద పెట్టినవే. ఆరోపణలున్నా అధికార బీజేపీలోని వారిని చూసీచూడనట్లు వదిలేయటం, విపక్షంలోని వారిపై అదేపనిగా కేసులు బనాయించటం, ప్రతిపక్షాల నుంచి బీజేపీలోకి జంప్ చేసినవారిపై కేసులు సద్దుమణగటం.. ప్రధానంగా ఈ ఫార్ములాతోనే మోదీ రాజకీయ విస్తరణ సాగుతోందన్న బలమైన ఆరోపణలున్నాయి. డబ్బు, ఇతర నజరానాలు, మీడియా నియంత్రణ వంటివి అదనం అనే ఆరోపణల్నీ తోసిపుచ్చలేం. ఈ రకంగానే, చట్టానికి దొరక్కుండా, అదే సమయంలో రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాల కూల్చివేతలు జరిగాయి.



2014లో అరుణాచల్‌ప్రదేశ్ శాసనసభలోని 60 స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 42 చోట్ల కాంగ్రెస్ గెలుపొంది ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా.. 2016లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పెమాఖండు నేతృత్వంలో 41 మంది ఎమ్మెల్యేలు బీజేపీకి చెందిన కూటమిలో చేరారు. ఆ తర్వాత 2015లో బీహార్ శాసనసభ ఎన్నికల్లో నితీష్ కుమార్ నేతృత్వంలో జేడీయూ, ఆర్జేడీ, కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు కాగా.. ఆ కూటమిలో చీలిక తేవటం ద్వారా 2017లో జేడీయూతో కలిసి, బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత 2018 మధ్యప్రదేశ్ ఎన్నికల్లో కమల్‌నాథ్ నేతృత్వంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చింది. 2017 మణిపూర్ ఎన్నికల్లో 60 స్థానాలకు గాను కాంగ్రెస్ 28 చోట్ల గెలవగా, కేవలం 21 స్థానాల్లో గెలిచిన బీజేపీ, గవర్నర్ బలంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇక 2017లో గోవాలో జరిగిన ఎన్నికల్లో 40 స్థానాలకు 17 స్థానాలను కాంగ్రెస్ గెలుచుకోగా, 13 స్థానాల్లోనే గెలిచిన బీజేపీ, గవర్నర్ వ్యవస్థ నుంచి అందిన సహకారంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 2018 ఎన్నికల్లో కర్ణాటకలో జేడీఎస్-కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగా.. ఫిరాయింపులతో 2019లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ బలంగా ఉన్నచోట ప్రాంతీయ పక్షాలతో ఫిరాయింపులను ప్రోత్సహించటంలో బీజేపీ విజయం సాధించింది. ఇటీవల మహారాష్ట్రలో శివసేనను చీల్చి ప్రభుత్వం ఏర్పాటులో బీజేపీ పాత్ర రహస్యమేమీ కాదు. రాజస్థాన్‌లో ఒకసారి ప్రయత్నించి విఫలమైంది. అలాగే 2022లో గోవా అసెంబ్లీ ఎన్నికల్లో 20 సీట్లు గెలిచి అతిపెద్ద పార్టీగా బీజేపీ అవతరించినా, మెజారిటీ లేకపోవటంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను లాక్కునేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. 11 స్థానాలు గెలిచిన కాంగ్రెస్ నుంచి మూడింట రెండోవంతుగా ఎనిమిది మంది ఎమ్మెల్యేలను చీల్చేందుకు బీజేపీ ఎత్తుగడలు వేసింది. ఎన్నికల ఫలితాలు వచ్చిన కొన్ని వారాలకు లోక్‌సత్తా యువ నాయకుడొకరు వ్యక్తిగత పర్యటనకు గోవా వెళ్లారు. ఎక్కడికెళ్లినా రాజకీయం, సమాజం గురించి తెలుసుకోవటం లోక్‌సత్తా నేర్పించింది కాబట్టి.. క్యాబ్ డ్రైవర్‌తో రాష్ట్రంలో పాలన, పార్టీల పరిస్థితి గురించి అడిగారు. ఇక్కడ ఏ పార్టీ గెలిచినా, ప్రభుత్వం బీజేపీదేనని సింపుల్‌గా తేల్చిచెప్పేశాడాయన. ఫిరాయింపుకి

ఎమ్మెల్యేలు రెడీగా ఉన్నా, తగిన సమయం కోసం వేచిచూస్తూ వచ్చింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ప్రారంభమైన వారం రోజులకి ఫిరాయింపుల్ని అమలు చేశారు. గోవా గత అసెంబ్లీలో 17 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో 15 మంది పార్టీ మార్చారు. వారిలో ఎక్కువమంది బీజేపీలో చేరారు. ఈసారి ఏమాత్రం వేచిచూడటం కూడా లేకుండా బరితెగించి ఎన్నికయిన నెలల వ్యవధిలోనే పార్టీ ఫిరాయించేశారు.

ఎలాగూ పార్టీ ఫిరాయిస్తారు కాబట్టి, కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేయాలి అని ప్రజలు అనుకోకుండా.. 2022 ఎన్నికలకు ముందు పార్టీ అభ్యర్థులు మొత్తం 37 మందితో పార్టీ ఫిరాయించబోమని గుడిలో, చర్చిలో, దర్గాలో కాంగ్రెస్ అగ్రనాయకత్వం ప్రమాణం చేయించింది, అఫిడవిట్ల మీద సంతకాలు చేయించింది. కానీ వాటన్నిటినీ తుంగలో తొక్కి ప్రజాస్వామ్యాన్ని మరింత పరిహరిస్తూ ఎన్నికై కొన్ని నెలలు కూడా గడవకముందే వారు పార్టీ ఫిరాయించేశారు. ఎమ్మెల్యేల అంతరాత్మల్ని ఏ మతం దేవుడూ, దేవతా ప్రభావితం చేయలేకపోయారు. పైగా దేవుడు చెప్పాడు, మేం పాటించాం అని మాజీ ముఖ్యమంత్రి కూడా అయిన దిగంబర్ కామత్ ఫిరాయింపుల్ని సమర్థించుకున్నారు. నేతలకు తప్ప పార్టీలకు ప్రాధాన్యతలేని రాజకీయానికి అలవాటుపడ్డ గోవా ఓటర్లు కూడా షాక్ తినేలా ఈ ఫిరాయింపులు జరిగాయి. గోవా రాష్ట్ర కాంగ్రెస్ శాసనసభా పక్షం అధికార బీజేపీలో విలీనానికి ఆమోదం తెలిపినట్లు అసెంబ్లీ స్పీకర్ వెంటనే ప్రకటించారు. తర్వాత దెబ్బ జార్ఖండ్‌కి పడబోయినా కొన్ని సమీకరణల రీత్యా వాయిదా పడింది. అలాగే తెలంగాణలో ఎమ్మెల్యేలకు ఎర కేసు పరిణామం, ఆ తర్వాత ఎన్నికల సంవత్సరం వచ్చేయటంతో రాష్ట్రంలో ఫిరాయింపుల రాజకీయం ఈసారికి సద్దుమణిగింది. పశ్చిమ బెంగాల్‌లో భారీ మెజారిటీతో గెలిచినా అభద్రతతో ఉన్న ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఢిల్లీ వెళ్లి మోదీతో ఏదో ఒప్పందం కుదుర్చుకున్నారని, అందువల్లే అంతా నార్మల్ అనే పరిస్థితి నెలకొందని గుసగుసలు చెప్పుకుంటున్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలో దీదీ మౌనం, అనుమానాల్ని మరింత పెంచింది. అయితే 'వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లో మాకు 35 ఎంపీ సీట్లు ఇవ్వండి. 2025లోగా రాష్ట్రంలోని టీఎంసీ ప్రభుత్వం కూలిపోతుంది' అని ఇటీవల యూనియన్ హోం మంత్రి అమిత్ షా ఇటీవల వ్యాఖ్యలు చేయటం మళ్లీ కలకలం రేపింది. అదేరీతిలో పంజాబ్, ఢిల్లీలోని 'ఆప్' ప్రభుత్వాలు కూడా అభద్రతతో ఉన్నాయి. మనీ లాండరింగ్, మద్యం కుంభకోణం కేసుల్లో ఢిల్లీ మంత్రులు రాజీనామా చేశారు. ఆప్ నుంచి బీజేపీలోకి ఫిరాయించాలన్న ఆఫర్‌ని తాను తిరస్కరించటం వల్లే మోదీ ప్రభుత్వం కక్ష సాధిస్తోందని రాజీనామాకు ముందు మనీష్ సిసోడియా ఆరోపించారు. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ వ్యవస్థాపకుడు అరవింద్ కేజ్రీవాల్ కూడా ఈ కుంభకోణంలో విచారణ



ఎదుర్కొంటున్నారు. కుదిరితే ఫిరాయింపులు, లేకుంటే కేసులు, జైళ్లతో బెదిరింపులు, ఇవేవీ సాధ్యం కాకుంటే ప్రలోభాలతో బలమైన, బలపడుతున్న ప్రతిపక్షాలను బలహీనపరచటానికి ప్రయత్నిస్తుండటంతో దాదాపు ప్రతి పార్టీ నాయకత్వం ఆందోళన చెందుతోంది. దేశంలోని ప్రతిపక్ష నాయకులను, ప్రభుత్వాలను లక్ష్యంగా చేసుకుని కేంద్ర దర్యాప్తు సంస్థల్ని, గవర్నర్ వ్యవస్థను ఉసిగొల్పే విధానం మన ప్రజాస్వామ్యానికి ఏమాత్రం క్షేమకరం కాదని నలుగురు ముఖ్యమంత్రులు సహా తొమ్మిది మంది విపక్ష పార్టీల అగ్రనేతలు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి హితవు పలికారు. తెలంగాణ ముఖ్యమంత్రి, భారాస అధ్యక్షుడు కె.చంద్రశేఖరరావు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ, ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్, బీహార్ ఉపముఖ్యమంత్రి, ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శరద్ పవార్, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, శివసేన (ఉద్ధవ్ బాలా సాహెబ్ ఠాక్రే) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే ప్రధానికి ఈ మేర లేఖ రాశారు.

గోవా సహా వివిధ రాష్ట్రాల్లో పార్టీలు ఫిరాయించినవారిలో అత్యధికులపై అక్రమాస్తులు, ఇతరత్రా ఆరోపణలున్నాయి. ఇలాంటి వారిపై ఈడీ దాడులు చేయటం, తమ రాజకీయ అవసరమనుకున్నప్పుడు ఫిరాయింపులతో పార్టీల్ని చీల్చి వారిని తమలో చేర్చుకోవటం బీజేపీ ఒక ఫార్ములాగా మార్చుకుని ఏమాత్రం దాపరికం లేకుండానే అమలు చేస్తోంది. మొదట్లోనే అనుకున్నట్టు, ఇదే తరహాలో నేర చరిత్ర ఉన్నా బీజేపీ వారి మీద దాడులు జరగటం లేదు, పార్టీ ఫిరాయించి బీజేపీలో చేరితే దాడులు ఆగిపోతున్నాయి. సువేందు అధికారి, హిమంత బిశ్వ, నారాయణ్ రాణె, సుజనా చౌదరి, సీఎం రమేష్ ఇలా అనేకమంది పార్టీ ఫిరాయింపులు ఇందుకు ఉదాహరణ. త్వరలో ఎన్నికలు జరగనున్న తెలంగాణలో కూడా బీజేపీ ఎక్కువగా ఇతర



పార్టీల నుంచి చేరికల మీదే ఎక్కువగా ఆధారపడుతోంది. సాధారణంగా ఒక నియోజకవర్గంలో ప్రధాన పార్టీకి మరీ ఎక్కువమంది నాయకులు లేని పరిస్థితి ప్రస్తుత కేంద్రీకృత రాజకీయ వ్యవస్థలో నెలకొంది. చాలాచోట్ల ఒకే నాయకుడు ఉంటున్నారు. వీరిలోనివారే ఎమ్మెల్యేగా ఎన్నికవుతుంటారు. ఎన్నికల మధ్య కాలంలో ఎమ్మెల్యేల్ని లాగగలిగితే ప్రభుత్వాన్ని అస్థిరపరచవచ్చు లేదా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చు కాబట్టి పార్టీ ఫిరాయింపుల మీద మోదీ నేతృత్వంలో పార్టీ ఎక్కువగా ఆధారపడుతోంది. ఈ విషయం సామాన్యులకు సైతం అర్థమవుతున్నా, గవర్నర్ల వ్యవస్థను కూడా దుర్వినియోగపరుస్తూ అధికార క్రీడ కొనసాగుతోంది. ఫలితంగా ఫిరాయింపులు సరికొత్త స్థాయికి చేరుకున్నాయి.

అలాగే ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చెప్పినట్లు, మన దేశంలో ప్రభుత్వాలు తలచుకుంటే కోటీశ్వరుల్ని బికారుల్ని చేయగలవు, బికారుల్ని కోటీశ్వరుల్ని చేయగలవు. ఆర్థిక వ్యవహారాల్లో జోక్యం చేసుకుని ప్రభుత్వాలు కంపెనీల ఫలితాల్ని ఎలా మారుస్తున్నాయో పలు ఉదంతాలు మనకు రుజువు చేస్తున్నాయి. అదానీ గ్రూప్ వేగంగా ఎదగటానికి తెలుగు రాష్ట్రాలు సహా పలుచోట్ల కంపెనీల్ని బలవంతంగా చేజిక్కించుకోవటమే కారణమనే బలమైన అనుమానాలున్నాయి. ఈ రకంగా ప్రజాప్రతినిధుల వ్యాపార మూలాల్ని కూడా దాడులతో దెబ్బతీస్తున్నారు. అవతలి వాళ్లు తప్పు చేశారు కాబట్టే మోదీ ఇరికించగలుగుతున్నారు అని వాదించొచ్చుగానీ, నిజాయతీ అయిన ప్రభుత్వం చేయాల్సిన పని ఎవరూ తప్పు చేయకుండా చట్టబద్ధపాలనని సవ్యంగా అమలు చేయటం గానీ.. ఒకరి తప్పును ఇంకొకరికి మేలు చేసేలా చట్టవిరుద్ధంగా జోక్యం చేసుకోవటం కాదు. ఒక్క రూపాయి లంచం లేకుండా ఏ సంస్థనయినా నిజాయతీగా నెలకొల్పటం, వ్యాపారం చేయటం సాధ్యమయ్యే పరిస్థితి మన దేశంలో నెలకొందా? మోదీని విమర్శిస్తున్నవారు కూడా చట్టబద్ధపాలన దిశగా పరిష్కారాల్ని ప్రతిపాదించకపోవటంతో వేడి తప్ప విషయంలేని రాజకీయం అప్రజాస్వామ్యం కొనసాగుతోంది.

దాడులు, కేసులతోపాటు డబ్బు కొనుగోళ్లు కూడా ఫిరాయింపుల్లో భాగంగా జరుగుతున్నాయనే అంచనాలున్నాయి. తన పార్టీ ఇప్పట్లో అధికారాన్ని కోల్పోయే అవకాశం లేదని, ఇంకోపార్టీ ప్రభుత్వం వచ్చి తన నిధుల సేకరణ, అధికార దుర్వినియోగం, మీడియా కట్టడి మొదలైన అంశాల మీద కేసులు బనాయించే అవకాశం లేదనే ధీమాతోనే మోదీ ఇష్టారాజ్యంగా దర్యాప్తు సంస్థల్ని ఉసిగొల్పుతున్నారని ఇటీవల ఒక సీనియర్ కాలమిస్ట్ వ్యాఖ్యానించారు. 2014 నుంచి ఎనిమిదేళ్లలో 285 మంది ఎమ్మెల్యేలను బీజేపీ ఇతర పార్టీల నుంచి లాక్కుంది. ఇందుకోసం దాదాపు 5,000 కోట్ల దాకా వెచ్చించినట్లు ఆరోపణలున్నాయి. ఇంకా రెట్టింపు ఖర్చు చేసిందని కొందరు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ పనులు కట్టబెట్టటం, పెండింగ్ పనులు చేసిపెట్టటం అదనం. కాంగ్రెస్‌ను బలహీనపరచటం, ప్రాంతీయ పార్టీలు ఏకం కాకుండా అడ్డుకోవటం, వ్యవస్థల్ని అవకాశవాదంతో ఉపయోగించుకోవటం, ఇతర పార్టీల నుండి నేతల్ని నయానో భయానో లాక్కోవటం మోదీ హయాంలోని బీజేపీ అధికార విస్తరణ వ్యూహంలో భాగంగా ఉన్నాయి. పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కేవలం ఎనిమిదింట్లో మాత్రమే స్పష్టమైన మెజారిటీ ఉందని అంచనా.

**వాజపేయి ఓటమి నేపథ్యంలో మోదీ ఎంచుకున్న మార్గం**

1999లో వాజపేయి ఫిరాయింపుల్ని ప్రోత్సహించకుండా కేవలం విలువల్ని పాటించటం కోసం ప్రధానమంత్రి పదవి దిగిపోయి తిరిగి ఎన్నికల్లో గెలిచిన సందర్భాన్ని స్ఫూర్తిగా తీసుకోకుండా.. ఆర్థిక సంస్కరణల్ని వేగంగా అమలుచేస్తూ ఫలితాలు సాధించే దశలో ఉన్నా 2004లో వాజ్‌పేయి ఓడిపోయిన సందర్భాన్ని మాత్రమే తీసుకుని మోదీ ప్రభుత్వం ఈ పంథాలో వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తుంది. అనర్హతకు దొరకకుండా చేస్తున్న ఈ రాజకీయ దండయాత్రలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం కూడా మూల్యం చెల్లిస్తున్నాయి. తమ పార్టీ సీనియర్ నేత, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు లాంటి వారు ఫిరాయింపులను బహిరంగంగా ఖండిస్తున్నా బీజేపీ నాయకత్వం పట్టించుకోవటం లేదు. ఈ రకమైన ధోరణిని ప్రదర్శిస్తుండటం వల్లే బీహార్‌లో అధికారంలో ఉన్న జేడీయూ పార్టీ బీజేపీని వీడి ఆర్‌జేడీతో జట్టు కట్టినట్లు చెబుతున్నారు. పెద్ద నోట్ల రద్దు (డీమానిటైజేషన్) వల్ల బోలెడు లాభాలొచ్చాయని యూనియన్ ప్రభుత్వం చెబుతున్నా, ప్రక్రియలో లోపం లేదని సుప్రీంకోర్టు క్లీన్‌చిట్ ఇచ్చినా.. దాని వల్ల ప్రజలకు కలిగిన లాభం కంటే మోదీ పార్టీకి రాజకీయంగా వచ్చిన లాభమే ఎక్కువని విశ్లేషకుల అభిప్రాయం.

**కాంగ్రెస్ పార్టీ మొదలుపెట్టిన దుష్ట సంస్కృతి**

దశాబ్దాల క్రితం కాంగ్రెస్ ప్రోత్సాహంతో మొదలైన ఫిరాయింపుల దుష్ట సంస్కృతి ఈవేళ బీజేపీ దాకా దాదాపు అన్ని

ప్రధాన పార్టీలకూ విస్తరించింది. ఫిరాయింపుల ద్వారా ప్రతిపక్షాలను దెబ్బతీయటానికి ప్రయత్నించని పార్టీ దాదాపు దేశంలో లేదు. అందుకే బీజేపీని ఎవరూ మరీ గట్టిగా నిలదీయలేకపోతున్నారు. 1957-67 మధ్యకాలంలో బయటి పార్టీల నుంచి 419 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో విలీనమయ్యారు. 1967-70 మధ్యకాలంలో ఎనిమిది వందల మంది చట్టసభ సభ్యుల పార్టీలు ఫిరాయిస్తే - 155 మందికి మంత్రిపదవులు వచ్చాయి. 2014 నుంచి బీజేపీ ఈ ఒరవడిని ఇంకా దూకుడుగా కొనసాగిస్తోంది. ఈ దెబ్బకి తట్టుకోలేక, ఏదోక రకంగా ఫిరాయింపులకు అడ్డుకట్ట పడాలని దాదాపు మిగిలిన పార్టీలన్నీ కోరుకుంటున్నాయి. పౌర సమాజం, ఉద్యమ సంస్థలు కూడా ఏదోక గట్టి ప్రయత్నం జరగాలనే అభిప్రాయాన్ని వినిపిస్తున్నాయి. కొందరైతే ఫిరాయింపుల నిరోధక చట్టం కోసం రాజ్యాంగంలో చేర్చిన పదవ షెడ్యూల్‌ను తొలగించాలంటున్నారు. చట్టాల వల్ల పెద్దగా ఒరిగేదేమీ ఉండదని, ఓటర్లే బుద్ధి చెప్పాలని వారు మొత్తం భారం ప్రజల మీదకు నెట్టేస్తున్నారు.

**కమిటీలో భిన్నాభిప్రాయాలు**

ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని బలోపేతం చేయటంపై దృష్టి పెట్టినట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కొన్నాళ్ల క్రితం రాష్ట్రాల చట్టసభల స్పీకర్‌ల సమావేశంలో తెలిపారు. చట్టంలో అవసరమైన సవరణలు చేపట్టేందుకు స్పీకర్లు, రాజ్యాంగ నిపుణులు, న్యాయకోవిదులు, ఇతర భాగస్వాములతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. ఫిరాయింపుల నిరోధక మార్పులపై పరిశీలనకు ఆయన 2019లో రాజస్థాన్ అసెంబ్లీ స్పీకర్ సి.పి జోషి నేతృత్వంలో త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేశారు. అయితే చట్టసవరణపై కమిటీ ఏకాభిప్రాయానికి రాలేదు. ఫిరాయింపుదారులపై వేటు విషయంలో సభాధ్యక్షులకు మరిన్ని అధికారాలనివ్వాలని, రాజకీయ పార్టీల అధినేతలకే సంబంధిత అధికారాలను కట్టబెట్టాలని.. భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

**ప్రజలు కూడా తప్పు అనుకోవటం లేదని గుర్తించాలి**

ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయమే అంతిమం. కానీ ప్రజలు కూడా తమ ఎమ్మెల్యే పార్టీ ఫిరాయించినా, తమకు పనులు చేసి పెట్టటం కోసం అధికార పార్టీలో చేరినా తప్పులేదని భావించే ధోరణులు పెరుగుతున్నాయని మనం గుర్తించాలి. ఇదే సమయంలో ప్రజలు ఒక పార్టీ తరపున అభ్యర్థిగా తనకు వేసిన ఓట్లతో గెలిచి ఆ తర్వాత మరో పార్టీలోకి మారటం అనైతికం, ప్రజాస్వామ్యానికి ప్రమాదం. ఇక ఎన్నికలకు అర్థమే ఉండదు. కాబట్టి, సమస్య మన దేశం ఉన్న పరిస్థితుల్లో జటిలమైనది. నేర చరితులు ఎన్నికల్లో గెలవటం ఎలాగైతే వ్యాధి లక్షణమే తప్ప వ్యాధి కాదో.. అలాగే ఫిరాయింపుల వెనక కూడా లోతైన సమస్యలున్నాయి. వీటన్నిటినీ సరిచేస్తూ, ఎన్నికలొచ్చేదాకా ప్రజలు వేచి చూడాల్సిన అవసరం లేకుండా, తాము ఎన్నుకున్న ప్రతినిధులు తమ తీర్పును గౌరవించేలా, ఎన్నికల్లో తమకు చెప్పిన భావజాలం, విధానాలకనుగుణంగా పనిచేసేలా నియంత్రించేందుకు చట్టం ద్వారా కూడా ఏర్పాటు ఉండాలి.

**ఎన్నికల్లో గెలుపుకి కోట్ల రూపాయలు అక్రమంగా ఖర్చు పెట్టటం దగ్గర్నుంచి..**

పార్టీ ఫిరాయింపులు, చీలిక వర్గం విలీనం, చట్టసభ సభ్యుల అనర్హతలకు సంబంధించి మహారాష్ట్ర శివసేనలోని రెండు వర్గాలు దాఖలు చేసిన పిటిషన్లు సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారణకు వచ్చిన నేపథ్యంలో ఈ అంశంపై ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ స్పందిస్తూ, ఎన్నికల్లో కోట్ల రూపాయల్ని చట్టవిరుద్ధంగా ఖర్చు చేయకుంటే అసలు బరిలోనే లేని పరిస్థితులతో మొదలుపెట్టి పలు అంశాలు ఫిరాయింపుల వెనక ఉన్నాయన్నారు. కోట్లు ఖర్చు పెట్టి గెలిచాక, ఎమ్మెల్యే ప్రభుత్వంలో భాగం కాకపోయినా, తన నియోజకవర్గంలో ప్రతి ప్రభుత్వ వ్యవహారంలో జోక్యం చేసుకుంటున్నాడన్నారు. కాంట్రాక్టులు, బదిలీలు, పోస్టింగులు, పోలీసు కేసులు వంటి వన్నీ అక్కడ శాసనసభ్యుని కనుసన్నల్లోనే జరుగుతాయన్నారు. ఇలా జవాబుదారీతనంలేని ప్రచ్ఛన్న అధికారాన్ని చెలాయించటం తప్పు అని ఏ ముఖ్యమంత్రయినా అంటే, సీఎం పదవికే ఎసరు వస్తుందన్నారు.

"శాసనసభలో ముఖ్యమంత్రికి మద్దతివటం, పార్టీ అభిప్రాయానికి డూడూ బసవన్నలా తలూపటం, నియోజకవర్గంలో మాత్రం మకుటం లేని చక్రవర్తిగా కొనసాగుతూ ఎన్నికల్లో చేసిన ఖర్చుని లాభసాటిగా రాబట్టుకోవటం ఎమ్మెల్యేల పాత్రగా మారిపోయింది.

పార్టీలు కొందరు వ్యక్తుల సొంత ఆస్తులుగా మారిపోవటంతో ఫక్తు వ్యాపార దృష్టితోనే ఎక్కువమంది శాసనసభ్యులు మొక్కుబడిగా పనిచేస్తూ సొంతలాభం చూసుకుంటున్నారు.

ప్రజలకు ఏదో సేవ చేద్దామని వచ్చి సొంత డబ్బు ఖర్చు పెట్టిన వ్యక్తిగత నిజాయతీపరులు సైతం ఏమీ సాధించలేపోతున్నారు.

అధికారం ముఖ్యమంత్రి వద్ద కేంద్రీకృతమై, నియోజక వర్గంలో పాలన కుంటుపడి ప్రభుత్వోద్యోగులు తమను ద్వితీయ శ్రేణి పౌరులుగా చూస్తున్న పరిస్థితుల్లో, ప్రజలు తమ రోజువారీ పనుల కోసం కూడా ఎమ్మెల్యే మీద ఆధారపడుతున్నారు.

అధికార పార్టీలో ఉన్నవారికి మాత్రమే పనులు జరిగే విపరీత రాజకీయ విభజన పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, పార్టీ ఫిరాయించయినా సరే అధికార పార్టీ ద్వారా తమకు పనులు చేసి పెట్టాలని ప్రజలు కోరుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి.

.. ఇవేవీ లేనట్లు నటిస్తూ పార్టీ ఫిరాయింపులే అసలు సమస్యన్నట్లు వ్యవహరిస్తే సాధించేదేమీ ఉండదు" అని జేపీ స్పష్టం చేశారు.

**పార్టీలకు బానిసల్లా వ్యవహరించనక్కర్లేదు**

పార్టీ ఫిరాయింపులను కట్టడి చేసేందుకు తెచ్చిన 91వ

# తెలుగునాట ఫిరాయింపులు

దేశంలో ఫిరాయింపుల రాజకీయం ఈనాటిది కాదు. ఏనాడో నాలుగు దశాబ్దాల క్రితమే హర్యానాలో పెద్దఎత్తున ఫిరాయింపులు జరిగినప్పుడు ఆయారాం గయారాం సంస్కృతి దిగ్భ్రాంతికర స్థాయిలో మొదలైంది. ఆ తర్వాత ఎవరైనా పార్టీ ఫిరాయించితే వారిని హర్యానా రాజకీయాల వారసులుగా చెప్పేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో కూడా అప్పుడప్పుడూ నాయకులు పార్టీ ఫిరాయించినా నైతిక విలువలకు కట్టుబడి రాజీనామా ఇచ్చేవారు. తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమంలో 2004లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎన్నికల పొత్తు పెట్టుకుని పోటీ చేశాయి. టీఆర్ఎస్ పార్టీ నుండి 16 మంది ఎమ్మెల్యేలు గెలిచారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వంలో కూడా చేరారు. అలాగే దేశంలో మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రభుత్వంలో టీఆర్ఎస్ వ్యవస్థాపకుడు, అప్పటి తెలంగాణ ఉద్యమ నాయకుడు, కరీంనగర్ ఎంపీ కల్వకుంట్ల చంద్రశేఖరరావు తన ముఖ్య సహచరుడైన సీనియర్ నాయకుడు అలె నరేంద్రతో కలిసి మంత్రిగా చేరారు. వైఎస్ మిత్రధర్మాన్ని పక్కనపెట్టి కొందరు టీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. ఆ తర్వాత నుండి మళ్లీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఫిరాయింపుల రాజకీయం పెద్దఎత్తున మొదలైంది. ఆ తర్వాత రెండుసార్లు తెలంగాణలో ఉద్యమం కోసం ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. రాజీనామా చేసిన ప్రతిసారి అందులో కొందరు గెలిచి, మరికొందరు ఓడిపోయారు. 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడింది. అప్పుడు కూడా ఆ ఫిరాయింపు రాజకీయాలను ఎక్కువగా ప్రోత్సహించారు. రాష్ట్రం విడిపోయే వరకు ఈ డ్రామా కొనసాగింది. 2014 జూన్ 2న రాష్ట్రం విడిపోయాక రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయ యవనికపై కొత్త చిత్రాలు ఆవిష్కృతమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ కనుమరుగైపోయింది. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదు. తల్లి కాంగ్రెస్‌ను చంపి పిల్ల కాంగ్రెస్ పార్టీ బతికింది. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ఆంధ్రప్రదేశ్‌లో 69 అసెంబ్లీ స్థానాలు గెలుచుకుంది. అందులో ఎన్నికలు జరిగిన సంవత్సరంలోపే 23 మంది వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యేలు తెలుగుదేశం పార్టీలోకి ఫిరాయించారు. 2019 అసెంబ్లీ ఎన్నికలు వచ్చేసరికి తెలుగుదేశానికి ఆ ఫిరాయింపుల శాపం తగిలిందా అన్నట్లు, రాష్ట్ర వ్యాప్తంగా సరిగ్గా 23 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఆ పార్టీ తరపున గెలిచారు. అందులో నుంచి కూడా కొందరు అనధికారికంగా వైఎస్సార్‌సీపీలో చేరిపోయారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కొందరు వైసీపీ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడటం కూడా ఫిరాయింపుల సంస్కృతిలో భాగంగానే పరిగణించాలి.

రాజ్యాంగ సవరణలో లోక్‌సత్తా పాత్ర కూడా ఉందని, ఆ చట్టం ఉన్నా కూడా ఫిరాయింపులు ఎందుకు జరుగుతున్నాయో ఆలోచించకుండా మళ్లీ ఇంకో చట్టం తెస్తామంటున్నారని జేపీ అన్నారు. పార్టీల్ని మతంలా, ఎన్నికైన వాళ్లని దేవుళ్లలా భావించే ధోరణి మనలో పాతుకుపోయి ఉందని, పార్టీలకు బానిసల్లా వ్యవహరించ నక్కర్లేదన్నారు. ప్రజాస్వామ్యంలో పార్టీలు కీలకం గానీ, ప్రజాస్వామ్యం పార్టీలస్వామ్యం కాకూడదన్నారు. పార్టీ ల్లో స్వేచ్ఛగా అభిప్రాయాలను వ్యక్తం చేసే అవకాశం, ఏ నేతల అండ దండలతో సంబంధం లేకుండా సమ ర్థతకు అనుగుణంగా ఎదిగే అవకాశాలు నేతలకు ఉండాలన్నారు. ఉదాహరణకు శివసేనలో తమకు నాయకుడిగా ఉన్న వ్యక్తి వ్యవహారశైలి నచ్చనప్పుడు నాయకత్వం మార్చాలని కోరుకునే హక్కు ఆ పార్టీ వారికి ఉంటుందన్నారు. చట్టసభల్లో ప్రతి అంశానికీ విప్ జారీ చేసి సభ్యుల గొంతు నొక్కకూడదన్నారు. ప్రస్తుత ఫిరాయింపుల చట్టం ఈ అంశాలన్నిటిపై నిశ్శబ్దం వహిస్తోందన్నారు.

ముఖ్యమంత్రులు తమ మనుగడకు ఎమ్మెల్యేల మీద ఆధారపడాల్సిన అవసరం లేకుండా వారిని ప్రజలే ప్రత్యక్షంగా ఎన్నుకోవటం, ఎన్నికల్లో డబ్బు ప్రభావాన్ని తగ్గించేందుకు దామాషా పద్ధతి మొదలైన ఎన్నికల సంస్కరణలు, పార్టీలను ప్రజాస్వామీకరించటం ఫిరాయింపుల నియంత్రణ ఏర్పాట్లలో కీలకమని జేపీ పేర్కొన్నారు. ఈ సంస్కరణలు లేకుండా ఎన్నికల సంఘం నియామక ప్రక్రియపై సుప్రీంకోర్టు హడావుడి వల్ల పెద్ద ప్రయోజనం ఉండదన్నారు. ఎన్నికల్ని స్వేచ్ఛగా, సక్రమంగా నిర్వహించటంలో, ఫలితాల్ని ప్రకటించటంలో మన ఎన్నికల సంఘం తన బాధ్యతల్ని సవ్యంగానే నెరవేరుస్తోందని, ఎన్నికల్లో ఓట్ల కొనుగోలు, అక్రమ డబ్బు ప్రవాహాల్ని నియంత్రిం చటంలో ఎన్నికల సంఘం పాత్ర పరిమిత మన్నారు. రాజకీయ

ఇక తెలంగాణ రాజకీయాల విషయానికి వస్తే, రాష్ట్రంలో మొత్తం 119 స్థానాలలో 2014లో జరిగిన ఎన్నికలలో జరిగిన మొదటి అసెంబ్లీ ఎన్నికలలో కేవలం 63 స్థానాలు గెలిచి కొద్దిపాటి మెజారిటీతో టీఆర్ఎస్ పార్టీ అధికారం చేజిక్కించుకుంది. అప్పుడు తెలుగుదేశం పార్టీకి 15 స్థానాలు లభించాయి. కాంగ్రెస్ పార్టీకి 21 సీట్లు వచ్చాయి. మజ్లిస్ పార్టీకి మామూలుగానే 7 స్థానాలు దక్కాయి. బీజేపీ అయిదు చోట్ల నెగ్గింది. ఇలా భిన్న పార్టీల కాంబినేషన్‌లో తెలంగాణ రాష్ట్ర మొదటి అసెంబ్లీ ఏర్పడింది. కానీ ఆ తర్వాత తెలుగుదేశం 15 మంది ఎమ్మెల్యేలలో సగం కంటే ఎక్కువమందిని టీఆర్ఎస్ ఆకర్షించింది. ఆ తర్వాత ఆపరేషన్ ఆకర్ష్‌లో భాగంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కూడా వరుసపెట్టి టీఆర్ఎస్ లాక్కుంది. అలా కాంగ్రెస్, టీడీపీల నుండి టీఆర్ఎస్ పార్టీలోకి వచ్చిన ఎమ్మెల్యేలకు మంత్రి పదవులు కూడా దక్కాయి. చివరికి సిద్ధాంతపరంగా బలంగా ఉండే కమ్యూనిస్టు పార్టీ సీపీఐ నుండి కూడా దేవరకొండ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ నాయక్ టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆ తర్వాత 2018 ఎన్నికలతో తెలంగాణలో రాజకీయ ముఖచిత్రం బాగా మారింది. రాష్ట్రంలో టీఆర్ఎస్ బలపడింది. ఎనభై అయిదు అసెంబ్లీ సీట్లకు పైగా గెలిచి రెండవసారి అధికారాన్ని చేజిక్కించుకుంది. ఆ ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు గెలిచారు. ఇక కాంగ్రెస్ పార్టీ 18 స్థానాలతో సరిపెట్టుకోవలసి వచ్చింది. బీజేపీకి ఉన్న అయిదు స్థానాల్లో నాలుగింట ఓటమి పాలవటంతో ఒకే ఒక స్థానం మిగిలింది. గోషామహల్ నియోజకవర్గం నుంచి రాజాసింగ్ ఒక్కరే బీజేపీ తరపున గెలిచారు. ఆ తర్వాత సంవత్సరంలోపు కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో 11 మంది టీఆర్ఎస్‌లో చేరిపోయారు. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్ ద్వారా కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ టీఆర్ఎస్‌లో విలీనం అయిపోయింది. ఆ తర్వాత రెండు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ సిటింగ్ స్థానాలను కోల్పోయింది. మునుగోడు ఉప ఎన్నిక విజయం తర్వాత టీఆర్ఎస్ బలం అసెంబ్లీలో 104కు పెరిగింది. కాగా, టీఆర్ఎస్ నుంచి నలుగురు ఎమ్మెల్యేలను లాక్కోవటానికి (వీరిలో ముగ్గురు ఇతర పార్టీల నుంచి టీఆర్ఎస్‌కు వచ్చినవారు) బీజేపీ కుట్ర పన్నిందని, ఈ కుట్రను తాము భగ్నం చేశామని ముఖ్యమంత్రి కేసీఆర్ మునుగోడు ఉప ఎన్నిక సమయంలో ప్రకటించారు. మొయినాబాద్‌లోని ఓ ఫాంహౌస్‌లో మంతనాలు జరుగుతుండగా పోలీసులకు తెలియచేసి ఆ మొత్తాన్నీ రికార్డు చేశామంటూ వీడియోలను విడుదల చేశారు. దీనిపై విచారణ కొనసాగుతోంది. ఇదీ స్థూలంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఫిరాయింపుల కథ.

వ్యవస్థ ఇందుకు చొరవ చూపాల్సి ఉందన్నారు. అలాగే ఎన్నికల సంఘం మంటే కేవలం కమిషనర్లు మాత్రమే కాదని, దేశ వ్యాప్తంగా పాలనా యంత్రాంగం ఆ సమయంలో ఎన్నికల సంఘంలా వ్యవహరిస్తుందన్నారు.

**ఎగువ సభల్లో విప్ జారీని పూర్తిగా తొలగించాలి**

ఎన్నికల వ్యవస్థలో, పార్టీల్లో ఈ సంస్కరణల్ని తెచ్చేలోగా రాజ్యసభలో, రాష్ట్రాల్లో ఎగువ సభల్లో విప్ జారీని పూర్తిగా తొలగించాలన్నారు. ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకునే దిగువ సభల్లో కూడా అవిశ్వాసం/విశ్వాసం, బడ్జెట్ సందర్భాల్లో తప్ప మిగిలిన అన్ని సమయాల్లో విప్ జారీ లేకుండా సభ్యులు స్వేచ్ఛగా తమ అభిప్రాయాల్ని చెప్పే అవకాశం కల్పించాలన్నారు. కనీసం ఇంతమేర చేశాక ఫిరాయింపులపై నిర్ణయాధికారాన్ని ఎన్నికల సంఘానికి అప్పగించాలన్నారు.

అలాగే ప్రయివేటు వ్యాపార సంస్థల ఆర్థిక వ్యవహారాల్లో ప్రభుత్వం పక్షపాతాలు చూపకుండా చట్టబద్ధపాలన సక్రమంగా అమలు చేయాలని జేపీ అన్నారు. అమెరికా వంటి దేశాల్లో దేశాధినేత కూడా ఒక వ్యాపారిని ఏమీ చేయలేడని, దీనివల్ల సమాజం బలం పెరగటంతోపాటు రాజకీయం కూడా ప్రజాస్వామ్యయుతమవుతుందన్నారు. పెట్టుబడులు పెరిగి ఆర్థికంగా కూడా దేశానికి మేలు జరుగుతుందన్నారు. ఎన్నికల సంస్కరణలతోపాటు స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేస్తే ఆరోగ్యకరమైన యువ నాయకత్వం ఎదుగుతూ కాలక్రమంలో పరిణతి ప్రజాస్వామ్యం సాధ్యమవుతుందని జేపీ పేర్కొన్నారు.

మోదీ ఆర్థిక రంగంలో సరైన దిశలో వ్యవహరిస్తున్నారు, కొన్ని చర్యల్ని బలంగా అమలుచేయగలుగుతున్నారు. కానీ రాజకీయ సంస్కరణల పట్ల ఆయన ఉదాసీనంగా వ్యవహరించటం వల్ల ఫిరాయింపులు సహా పలు జాడ్యాలు ఉన్నకొద్దీ పెరుగుతున్నాయి. ఈ సంస్కరణలపై మోదీ ప్రభుత్వం ఇప్పటికైనా దృష్టి పెట్టాలి. వీటిని సాధించటానికి కావలసిన రాజకీయ బలం, ప్రజామోదం ఆయనకు ఉన్నాయి. జేపీ చెప్పినట్లు, పార్టీ ప్రయోజనం, దేశ ప్రయోజనంతోపాటు చరిత్రలో తన స్థానాన్ని కాపాడుకోవాలంటే మోదీ ఏమాత్రం తాత్సారం చేయకుండా ఆట నియమాల్ని మార్చే రాజకీయ సంస్కరణల్ని ప్రారంభించాలి.

◆

## అధ్వాన్న మౌలిక వసతులు, అరకొర ప్రభుత్వ వైద్యం ..

# కుంగుతున్న పట్టణ ఆరోగ్యం

-దివ్యాన్షశ్రీ-





భారత్‌లో పట్టణీకరణ శరవేగంగా సాగుతోంది. పెరుగుతున్న జనాభా, పల్లెల్లో ఉపాధిలేమి, వ్యవసాయంలో నష్టాలు వంటి కారణాలతో ఎందరో పట్టణాలు, నగరాలకు తరలి వస్తున్నారు. ఫలితంగా వాటిలో పేదలు అధికమవుతున్నారు. పోనుపోను వారిని అనారోగ్య సమస్యలు పట్టిపీడిస్తున్నట్లు 17 స్వచ్ఛంద సంస్థలతో కలిసి అజీం ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం కొంతకాలం క్రితం నిర్వహించిన అధ్యయనం తేటతెల్లం చేసింది. పట్టణాల్లోని సంపన్నులతో పోలిస్తే పేద పురుషుల్లో సగటున తొమ్మిదేళ్లు, మహిళల్లో ఆరేళ్ల చొప్పున ఆయుర్దాయం తెగ్గోసుకుపోతున్నట్లు ఆ అధ్యయనం ఆందోళనకర అంశాలను వెల్లడించింది. సరైన వైద్య సదుపాయాలకు నోచని పట్టణ ప్రాంత పేదల పాలిట గుదిబండగా మారుతున్న వైద్యఖర్చులపైనా ఆవేదన వ్యక్తం చేసింది.

దేశీయంగా దాదాపు మూడోవంతు జనాభా ప్రస్తుతం పట్టణాలు, నగరాల్లో నివసిస్తోంది. ఏటా దాదాపు 75 లక్షల మంది అదనంగా జతపడుతున్నట్లు నీతి ఆయోగ్ పేర్కొంది. పల్లెలు, ఆదివాసీ ప్రాంతాల ఆరోగ్యంపై కొంతయినా ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వాలు పట్టణాలపై శీతకన్ను వేశాయి. సరైన వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడం, సామాజిక భద్రత పథకాలు దూరం కావడం, స్వచ్ఛమైన తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు కొరవడటం, వాయు కాలుష్యం, వ్యర్థాలు, ప్రమాదకరమైన పని ప్రదేశాలు వంటివి పట్టణాల్లో పేదల ఆరోగ్యానికి పొగ పెడుతున్నాయి. పాలకుల బాధ్యతారాహిత్యం, అధికారుల నిర్లక్ష్యం, అస్తవ్యస్త ఆర్థిక విధానాలు, అవినీతి, పర్యావరణ విధ్వంసం వంటివీ వారి పాలిట శాపంగా మారుతున్నాయి. అరకొర ఆదాయాలతో వారు సరైన పౌష్టికాహారానికి దూరమవుతున్నారు. కనీస మౌలిక సదుపాయాలు కొరవడటంతో మురికివాడల్లో నివసించే వారిని వ్యాధులు మరింతగా చుట్టుముడుతున్నాయి. నేటికీ పట్టణాల్లో అయిదేళ్లలోపు పిల్లల్లో 30 శాతం తీవ్ర ఎదుగుదల లోపాలు ఎదుర్కొంటున్నట్లు అయిదో విడత జాతీయ కుటుంబ సర్వే తెలియజెప్పింది. ఆరు నెలల నుంచి అయిదేళ్లలోపు పిల్లల్లో 64 శాతాన్ని రక్తహీనత పట్టిపీడిస్తోంది. 15-49 ఏళ్ల మహిళల్లో 54 శాతాన్ని ఇదే సమస్య బాధిస్తోంది.

దేశవ్యాప్తంగా గుజరాత్, ఉత్తరాఖండ్, మణిపూర్ వంటి 14 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని పట్టణాల్లో 2020 జులై నాటికి ఆరోగ్య కేంద్రాలు 50 శాతానికిపైగా తక్కువగా ఉన్నాయని తేల్చి చెప్పింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర వంటి చోట్ల 20-40 శాతం కొరవడ్డాయి. భారత్‌లో 65 శాతం ఆకస్మిక మరణాలు గుండె, ఊపిరితిత్తుల జబ్బుల వంటి అసాంక్రామిక వ్యాధుల వల్లే సంభవిస్తున్నట్లు ఆర్థిక సర్వే పేర్కొంది. అరకొర ప్రభుత్వ ఆరోగ్య వసతుల కారణంగా పట్టణ పేదలు విధిలేని పరిస్థితుల్లో ప్రైవేటు దవాఖానాలను ఆశ్రయించి ఇంటిని గుల్ల చేసుకోకతప్పడం లేదు. పట్టణ ప్రాంతాల్లో కేవలం 9.8 శాతం పేదలకే ప్రైవేటు లేదా ప్రభుత్వ ఆరోగ్య బీమా

సదుపాయం అందుబాటులో ఉందని అధ్యయనాలు పేర్కొంటున్నాయి.

జాతీయ ఆరోగ్య విధానం–2017 సూచించిన ప్రకారం, ప్రభుత్వాలు ఆరోగ్య రంగానికి జీడీపీలో 2.5 శాతం నుంచి మూడు శాతం వరకు ప్రత్యేకిస్తే ప్రజల జేబులపై భారం 65 శాతం నుంచి 30 శాతానికి తగ్గుతుందని అధ్యయనాలు చాటుతున్నాయి. ప్రస్తుతం ప్రజారోగ్యానికి జీడీపీలో 1.8 శాతమే కేటాయిస్తున్నారు. భారంగా మారిన వైద్యవ్యయాలతో భారత్‌లో ఏటా అయిదు కోట్ల మంది పేదరికంలోకి జారిపోతున్నారు. చాలామంది సరిపడా డబ్బు లేక చికిత్సను వాయిదా వేస్తూ నరకం అనుభవిస్తున్నారు. పేదలకు నగదు రహిత చికిత్సను అందించేందుకు ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) పథకాన్ని మూడేళ్ల క్రితం కేంద్రం అందుబాటులోకి తెచ్చింది. అది ఆశించిన ఫలితాలను ఇవ్వడంలేని ఛత్తీస్‌గఢ్‌లో జరిపిన పరిశీలనలు తెలియజెబుతున్నాయి. 2050 నాటికి భారత్‌లో పట్టణ జనాభా 87 కోట్లు దాటుతుందని ఐక్యరాజ్యసమితి అంచనా వేసింది. దేశంలోని మొత్తం పేదల్లో పట్టణ ప్రాంతాల వాటా ప్రస్తుతం 27 శాతం దాకా ఉంది. ఇది క్రమంగా పెరుగుతోంది. వీరికి మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి. పట్టణ ప్రజల ఆరోగ్యం, పౌష్టికాహారం తదితరాలపై సమగ్ర వివరాలు సేకరించాలి. తదనుగుణంగా సమర్థ ప్రణాళికలను రూపొందించి, చురుగ్గా అమలుపరిస్తేనే కొన్నేళ్లకైనా ఆరోగ్య భారతం సాకారమవుతుంది. **(కర్టెసీ: ఈనాడు)**

# జలవనరుల సమగ్ర గణన

దేశంలో తొలిసారిగా యూనియన్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర జలగణన సర్వే వివరాలను ఇటీవల జలశక్తి శాఖ విడుదల చేసింది. దీని ప్రకారం, దేశంలో మొత్తం 24,24,540 నీటి వనరులున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 97.1 శాతం, పట్టణ ప్రాంతాల్లో 2.9 శాతం మేర విస్తరించాయి. మొత్తం నీటి వనరుల్లో అత్యధిక భాగం (59.5 శాతం) నీటి కొలనులు, సరస్సులు, చెరువుల్లో విస్తరించి ఉన్నాయి. 15.7 శాతం నీటి ట్యాంకులు, 12.1 శాతం రిజర్వాయర్లు, 9.3 శాతం చెక్‌డ్యాములు ఉన్నాయి. ప్రయివేటు యాజమాన్యంలో 55.2 శాతం, ప్రభుత్వ అధీనంలో 44.8 శాతం నీటివనరులున్నట్టు లెక్కతేలింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో చెరువులు, నీటి కొలనులు పెద్దఎత్తున ఆక్రమణకు గురయ్యాయని గుర్తించింది. దేశంలో అత్యధికంగా 7.47 లక్షల జలవనరులతో పశ్చిమ బెంగాల్ ప్రథమ స్థానంలో ఉండగా, దేశంలోనే అత్యధిక జనాభా గల ఉత్తరప్రదేశ్‌లో కేవలం 2.5 లక్షల నీటివనరులున్నాయి.




# ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న మంత్రులు

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి ప్రజలు అధికారం ఇచ్చి నాలుగేళ్లు పూర్తయినా పోలవరం పూర్తి చేయలేదని, ఉత్తరాంధ్రలో కనీసం ఒక్క సాగునీటి ప్రాజెక్టుపై పూర్తిస్థాయిలో నిధుల కేటాయింపు చేయకుండా కాలక్షేపం చేస్తున్నారని, తూతూ మంత్రంగా సమీక్షలు నిర్వహించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విజయనగరంలో అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, నీటిపారుదల మంత్రి అంబటి రాంబాబు జిల్లాలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులపై తాజాగా చేసిన సమీక్షా సమావేశం ఎటువంటి ప్రయోజనం లేకుండా ముగిసిందన్నారు. నిధులు విడుదల చెయ్యకపోతే తాము ఏమి చేయగలమని అధికారులు పెదవి విరుస్తున్నారని, నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో ఉత్తరాంధ్ర నష్టపోయిందని అన్నారు. ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయాలన్న ధ్యాసే ఉత్తరాంధ్రలోని మంత్రులు, ఎమ్మెల్యేలకు లేదన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడి చర్యలు తీసుకోవాలని భీశెట్టి కోరారు.

# వ్యర్థజలాల పునర్వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచాలి



**నెక్నాంపూర్ చెరువులోని తేలియాడుతూ శుద్ధి చేసే 'ఫ్లోటింగ్ ట్రీట్‌మెంట్ వెట్‌ల్యాండ్'**

శరవేగంగా పెరుగుతున్న పట్టణీకరణ వల్ల వెలువడుతున్న వ్యర్థజలాలు అనేక సమస్యలు సృష్టిస్తున్నాయి. వీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించటంపై దృష్టి పెట్టాలని నీతిఆయోగ్ సూచించింది. ఇప్పటికే మన దేశంలో పట్టణ ప్రాంతాల నుంచి వెలువడుతున్న మురుగు, వ్యర్థ జలాలతో నదులు, చెరువులు, భూగర్భ జలాలు తీవ్రంగా కలుషితమవుతున్నాయని 'అర్బన్ వేస్ట్‌వాటర్ సినారియో ఇన్ ఇండియా' పేరుతో విడుదల చేసిన ఇటీవలి నివేదికలో స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా 323 నదుల్లో 351 చోట్ల నీటి కాలుష్యాన్ని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి పరీక్షించింది. 13 శాతం తీవ్రంగా, 17 శాతం మధ్యస్థంగా కాలుష్యం ఉన్నట్లు తేలింది. భారలోహాలు, ఆర్సినిక్, ఫ్లోరైడ్స్, విషపూరిత రసాయనాలున్నట్లు పలుచోట్ల గుర్తించారు. భూగర్భ జలాలు ఎక్కువగా కలుషితమైనట్లు తేలింది. దేశవ్యాప్తంగా ఉన్న 1195 శుద్ధిప్లాంట్లలో 102 పనిచేయటం లేదని గుర్తించారు.

నెక్నాంపూర్ చెరువు ఆదర్శం

గ్రేటర్ హైదరాబాద్‌లో నీటిశుద్ధి కోసం చేపడుతున్న చర్యల గురించి నీతిఆయోగ్ నివేదికలో ప్రత్యేకంగా ప్రస్తావించింది. నెక్నాంపూర్ చెరువు నీటిలో కదులుతూ శుద్ధి చేసే 'ఫ్లోటింగ్ ట్రీట్‌మెంట్ వెట్‌ల్యాండ్' వల్ల నీటిశుద్ధి నిర్వహణ మెరుగ్గా ఉందని తెలిపింది. ఈ చెరువు నీటిశుద్ధి కోసం 3000 చదరపు అడుగుల రాఫ్ట్ ఏర్పాటు చేసి దానిపై 3500 మొక్కలు నాటారు. ఇది నీటిలో కదులుతుంటే మొక్కల అడుగుభాగాలు నీటిని శుద్ధి చేస్తుంటాయి.

**నివేదికలోని ముఖ్యాంశాలు..**

- భారతదేశ జనాభా 138 కోట్లకు చేరువైంది. వీరిలో 48.30 కోట్ల మంది పట్టణాల్లోనే నివసిస్తున్నారు. 2050 నాటికి పట్టణ జనాభా 87.70 కోట్లకు చేరుతుందని అంచనా.
- గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు అధికంగా ఉంటున్నాయి. 2050 నాటికి 70 శాతం మంది పట్టణాల్లోనే నివసిస్తారు. దీంతో ఆ ప్రాంతాల్లో స్వచ్ఛమైన నీటికి తీవ్ర కొరత ఏర్పడుతుంది.
- మన దేశంలోని పట్టణ ప్రాంతాల్లో రోజుకు 72,368 మిలియన్ లీటర్ల (మి.లీ), గ్రామీణ ప్రాంతాల్లో 39,604 మి.లీ. వ్యర్థజలాలు వెలువడుతున్నాయి. కానీ వీటిలో 28 శాతం మాత్రమే శుద్ధి చేస్తున్నారు. మరో 4827 మి.లీ.

నీటిశుద్ధికి ప్లాంట్లను నిర్మించాలనే ప్రతిపాదనలున్నాయి. ఇవి నిర్మించినా సమస్య తీరదు.

- మిగిలిన 72 శాతం జలాలను నదులు, చెరువులు, భూగర్భంలోకి వదులుతున్నారు. వీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగిస్తే విలువైన వనరుగా ఉపయోగపడతాయి. అయితే దీనికి అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. నగరాల్లో స్థలాల కొరత తీవ్రంగా ఉంది. నీటి ప్రవాహాలపై పక్కా సమాచారం లేకపోవటం, ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించకపోవటం లాంటి సవాళ్లు ఉన్నాయి. వ్యర్థ జలాల పునర్వినియోగంపై ప్రజల్లో విముఖత కూడా ఉంది. సమగ్ర సమాచారాన్ని ముందుంచి వారికి అవగాహన కలిగించాలి.
- ప్రపంచ వ్యాప్తంగా తక్కువ వ్యయంతో వ్యర్థజలాల శుద్ధికి అధునాతన టెక్నాలజీలు అందుబాటులోకి వస్తున్నాయి. వాటిని వినియోగించుకునేందుకు స్థానిక ప్రభుత్వాలు చొరవ చూపాలి.

## వంద శాతం మురుగుశుద్ధి లక్ష్యం కోసం..

హైదరాబాద్‌లో మురుగునీటి శుద్ధి కోసం రూ.3,866 కోట్ల వ్యయంతో 1259 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో 13 ప్రాంతాల్లో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా పనులు పూర్తయిన ఎస్‌టీపీల్లో ప్రయోగాత్మకంగా మురుగుశుద్ధి ప్రారంభమైంది. తొలుత మాదాపూర్ దుర్గం చెరువు వద్ద 7 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన ఎస్‌టీపీలో ట్రయల్ రన్ ప్రారంభించారు. జులై నాటికి అదనంగా మరో 971 మిలియన్ లీటర్ల మురుగుశుద్ధి చేసేందుకు అవకాశం ఏర్పడుతుందని అంచనా. ప్రస్తుతం 25 ఎస్‌టీపీల ద్వారా 772 మిలియన్ లీటర్లు శుద్ధి చేస్తున్నారు. మిగతా 878 ఎంఎల్‌డీల వరకు ఎలాంటి శుద్ధి లేకుండానే బయటకు వెళ్తోంది. ఈ నేపథ్యంలో కొత్తగా చేపట్టే ఎస్‌టీపీల ద్వారా 100 శాతం మురుగుశుద్ధి చేయాలని జలమండలి లక్ష్యంగా పెట్టుకుంది. జూన్, జులై నాటికి పూర్తిస్థాయిలో ఆ సంకల్పం నెరవేరుతుందని అధికారులు చెబుతున్నారు. ఎస్‌టీపీలు పూర్తయి మురుగుశుద్ధి ప్రారంభమైతే.. దేశంలోనే 100 శాతం మురుగుశుద్ధి చేస్తున్న నగరంగా హైదరాబాద్ రికార్డులకు ఎక్కనుంది. ఈ ఏడాది ఆగస్టు నాటికి దాదాపు 1100 ఎంఎల్‌డీల మురుగు శుద్ధి చేసే సామర్థ్యం అదనంగా పెరగనుంది.

### జీహెచ్‌ఎంసీలో కొత్త ఎస్‌టీపీలు..

| ప్రాంతం | సామర్థ్యం (ఎంఎల్‌డీలు) |
|---|---|
| అంబర్‌పేట | 212.50 |
| నల్లచెరువు | 86.50 |
| కాప్రా చెరువు | 20.00 |
| నాచారం పెద్దచెరువు | 17.50 |
| రామచెరువు | 30.00 |
| బండచెరువు | 15.00 |
| ఆర్కెపురం చెరువు | 5.50 |
| న్యూ అల్వాల్ చెరువు | 15.50 |
| రాజేంద్రనగర్ సర్కిల్ (5) | 160.50 |
| ఎల్‌బీ నగర్ సర్కిల్ (1) | 320.00 |
| కూకట్‌పల్లి సర్కిల్ (6) | 202.00 |
| కుత్బుల్లాపూర్ సర్కిల్ (5) | 66.00 |
| శేరిలింగంపల్లి సర్కిల్ (6) | 108.50 |

## ఫ్లోటింగ్ సైకిల్‌తో శుద్ధి

నెక్నాంపూర్ చెరువులో ప్రతి నెలా 20 ఎంఎల్‌డీల వ్యర్థాలు చెరువులో కలుస్తుండటంతో.. శుద్ధి కోసం ఇటీవల తేలియాడే సైకిల్‌ను రూపొందించారు. ఫ్లోటింగ్ సైకిల్ ఆవిష్కరణలో ధ్రువాంశ్ స్వచ్ఛంద సంస్థ ప్రయత్నానికి జేఎన్‌టీయూ విద్యార్థులు మద్దతుగా నిలిచారు. కేవలం రూ.85 వేలతో ఈ సైకిల్ తయారైంది. ఒక వ్యక్తి దీనిపై కూర్చుని పెడల్ తొక్కుతూ చెరువంతా చుట్టేస్తున్నారు. నిత్యం నాలుగైదుసార్లు చక్కర్లు కొడుతూ మురుగు చేరకుండా పర్యవేక్షిస్తున్నారు. అలాగే ఇటీవల మల్కారం చెరువు శుద్ధికి లేక్ ఒడ్డున 'లెగసీ లీచెట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్'ను ప్రభుత్వం ప్రారంభించింది. హైదరాబాద్ జవహర్‌నగర్ డంపింగ్ యార్డు నుంచి కొన్నేళ్లుగా వెలువడుతున్న కఠినమైన మురుగుజలం కోట్ల లీటర్ల మేర మల్కారం చెరువులో నిల్వ ఉంది. ట్రీట్‌మెంట్ ప్లాంట్ ప్రాజెక్ట్ వ్యయం రూ.251 కోట్లు. చెరువులో నీటిని శుద్ధి చేసి దిగువన ఉన్న చీర్యాల చెరువుకు వదులుతారు.





# వర్షపు నీటి కాలువలు, భూగర్భ డ్రైనేజిలు - ప్రజల ఆరోగ్యంపై ప్రభావం

**- సత్య వెలిగట్ల, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్, ఫోన్: 99124 15128**

ఈ ఫోటోలను ఒక్కసారి గమనించండి.

ఈ రెండు నిర్మాణాలు మన దేశంలో, రాష్ట్రాలలో కనపడతాయి. ఈ రెండు నిర్మాణాల పేర్లు ఒకటి వర్షపు కాలువలు, రెండవది భూగర్భ డ్రైనేజి లైన్‌లు. వర్షపు నీరు రోడ్లపై ప్రవహించకుండా వాన (వరద) నీటి కాలువల ద్వారా చెరువులకు, నదులకు అనుసంధానం చేస్తారు. రెండవది, భూగర్భ డ్రైనేజి లైన్‌లు. మలమూత్ర విసర్జనలు రోడ్ల మీద ప్రవహించకుండా భూగర్భంలో ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌లలోకి మళ్లిస్తారు. డ్రైనేజి నీటిని, ఆ పైప్‌లైన్‌లను ఎస్.టి.పిలకు తరలించి, వాటి ద్వారా శుద్ధి చేసిన నీటిని చెరువులలో కలిపే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మన ప్రభుత్వాలు ఈ మూడు నిర్మాణాలను ప్రజా సౌకర్యాల ఏర్పాటులో భాగంగా పరిసరాల పరిశుభ్రత కోసం, ప్రజల ఆరోగ్యం కాపాడటం కోసం కొన్ని వందల కోట్ల రూపాయలతో ఏర్పాటు చేస్తున్నాయి. అయితే దురదృష్టంకొద్దీ ప్రణాళికా లోపం, అవగాహనా రాహిత్యం, అశ్రద్ధ, అలక్ష్యం వల్ల ప్రజలకు ప్రయోజనాలు చేకూరకపోగా మరిన్ని అనర్థాలు, నష్టాలు వచ్చి పడుతున్నాయి.

అలాగే స్వచ్ఛ భారత్, 'షాప్ హైదరాబాద్ షాన్ హైదరాబాద్' లాంటి నినాదాలతో బహిరంగ మలమూత్ర విసర్జనలను అరికట్టటానికి మన పన్నుల సొమ్ములలో కొన్ని వేల కోట్ల రూపాయలతో పబ్లిక్ టాయిలెట్లు, భూగర్భ డ్రైనేజిలు ఏర్పాటు చేశారు. అలాగే గృహాలలో నిర్మించుకునే టాయిలెట్స్ నిర్మాణాలకు సబ్సిడీలతో ప్రోత్సహిస్తున్నారు. కానీ 'డబ్బూ పోయె శనీ పట్టె' అన్నట్లు, ఇంత ఖర్చు చేస్తూ మళ్లీ ఆ మలమూత్ర విసర్జనల మురుగునీరును జన నివాసాల మధ్య ఉన్న వర్షపు నీటి కాలువలలో, చెరువులలో బహిరంగంగా వదలటాన్ని ఏమనాలి?

భూగర్భంలో పైప్‌లైన్ ద్వారా మానవ మలమూత్ర వ్యర్థాలను ఎస్.టి.పిలకు అనుసంధానించి, శుద్ధి చేసి చెరువులలోకి వదలాలి. అలాకాకుండా చాలాచోట్ల పైప్‌లైన్‌లను డైరెక్టుగా చెరువులలో కలిపేస్తున్నారు. అలాగే కొన్నిచోట్ల భూగర్భ డ్రైనేజిల లీకేజిలను అరికట్టకుండా ఇళ్ల మధ్య ఉన్న వర్షపు నీటి కాలువలలో కలుపుతూ బహిరంగంగా చెరువులలో కలుపుతున్నారు. దీనివల్ల షాప్ హైదరాబాద్ షాన్ హైదరాబాద్, స్వచ్ఛ భారత్ లాంటి కార్యక్రమాలు అంచు డాబే గానీ, పంచె డాబు లేదు అన్నట్లు తయారైనాయి.

కొంతకాలంగా రాజధాని నగరంలో కొత్త ఎస్.టి.పిలు నిర్మించటం జరుగుతోంది. కానీ వాటిని కూడా సరిగా నిర్వహించటం లేదు. వాటి పనితీరును పరిశీలిస్తామంటే అనుమతించటం లేదు. 'ఒలకపోసుకోవటం, మరల ఎత్తుకోవటం'లా జరుగుతున్న ఇలాంటి చర్యలు.. అవగాహన లేకనా, అలక్ష్యం, అశ్రద్ధతతో కూడిన మూర్ఖత్వం, అడిగేవారెవరు అనే పెత్తందారీ ఆభిజాత్యం వల్లా?.. అర్థం కాని పరిస్థితి.

**బాక్స్ డ్రెయిన్ల రూపంలో మరో సమస్య సృష్టిస్తున్నారు**

మరోవైపు, 'మేడిపండు చూడ మేలిమై యుండు, పొట్ట విప్పి

చూడ పురుగులుండు' అన్న సామెతను గుర్తుకుతెస్తూ ఈ మధ్య కాలంలో మన జీహెచ్ఎంసీ వారు చెత్తాచెదారం, మురుగునీటితో కూడిన వర్షపు నీటి కాలువలను సిమెంట్ కాంక్రీట్ శ్లాబులతో కప్పివేస్తున్నారు. వర్షపు నీటి కాలువలను సిమెంట్ కాంక్రీట్ శ్లాబులతో మూసివేస్తూ బాక్స్ డ్రెయిన్ల రూపంలో జీహెచ్ఎంసీ, పెద్ద నగరాలను మరింతగా నాశనం చేస్తున్నారు. ఈ బాక్స్ డ్రెయిన్ల నిర్మాణంలో తగు జాగ్రత్తలు పాటించటం లేదు. ఎ) నిర్మించే ముందు కాలువలలో పూడిక తీయటం లేదు బి) యు.జి.డిల నుంచి ఓపెన్ కాలువలలోకి వచ్చే మురుగునీటి లీకేజీలను అరెస్ట్ చేయలేదు. పైగా కొత్తగా యు.జి.డిలను కలుపుతున్నారు సి) సకాలంలో పూడికలు తీయటానికి, నిర్వహణకు అనుకూలంగా ఉండే విధంగా కనీస జాగ్రత్తలు తీసుకోలేదు డి) చాలాచోట్ల వర్షపు నీరు పారటానికి మార్గం చూపటం లేదు.

చివరికి భూగర్భ డ్రైనేజికి, వర్షపు నీటి కాలువలకు తేడా లేకుండా చేశారు. మన ఇంటిలోని ఫ్రిజ్‌లో వస్తువుల్ని లేదా తడిచెత్త గల డస్ట్‌బిన్‌లను సకాలంలో తొలగించి శుభ్రపరచకపోతే ఎంత దుర్వాసన వస్తుందో తెలిసిన విషయమే. మరి అలాంటిది ఈ బాక్స్ డ్రెయిన్లలో మానవ మలమూత్ర వ్యర్థాలతో కూడిన డ్రైనేజి నీరు, అప్పటికే కొన్ని ఏళ్ల పాటు పూడిక తీయకుండా పేరుకుపోయిన చెత్తచెదారంతో కలిసి కుళ్లిపోతే ఇంకెంత దుర్గంధం వస్తుంది? ఎన్ని రకాల రోగాలు వస్తాయి? ప్రజలు ఎన్ని అనారోగ్యాల బారిన పడాలి? ఎన్ని అనర్థాలు!.. మనందరం ఒక్కసారి ఆలోచించాలి.

ఇలాంటి చర్యల వలన వర్షాకాలంలో వర్షపు నీరు వర్షపు నీటి కాలువలలోకి వెళ్లకుండా రోడ్లపై ప్రవహించటం, తద్వారా కోతకు గురై రోడ్లన్నీ పాడయిపోయి ఆర్థిక (మన పన్నుల సొమ్ములు) నష్టమే కాకుండా ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు, అసౌకర్యానికి, ప్రమాదాలకు గురవుతున్నారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా తయారవటం, విపరీత దుర్గంధం, మలేరియా, డెంగీ లాంటి రోగాలతో మన కుటుంబ సభ్యుల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. తద్వారా ప్రమాదకరమైన విషజ్వరాలతో ప్రజలు అనారోగ్యాల బారిన పడి, ఆసుపత్రుల పాలై, అనేక అసౌకర్యాలతోపాటు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవలసి వస్తుంది. ఒకవైపు ప్రజలు తమ ఉమ్మడి అవసరాలకు/ సౌకర్యాలకు పన్నులు చెల్లిస్తూ మరొకవైపు ఇంతటి అసౌకర్యాలకి, దారుణ దుర్భర పరిస్థితులకు గురవుతున్నారు. ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుకుంటున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ సమస్యలకు ఒక మంచి పరిష్కారం చూపాలి. ◆

## 40% కి పైగా పిల్లలు టెక్నాలజీకి దూరం

నేర్చుకునే ప్రక్రియలో ఎన్నడూ ఎలాంటి సాంకేతికతను ఉపయోగించని విద్యార్థులు 40 శాతానికి పైగా ఉన్నారని ఒక సర్వే తెలిపింది. 'భారత్ సర్వే ఫర్ ఎడ్‌టెక్' (బేస్) పేరుతో 'సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్' సంస్థ తెలంగాణ, గుజరాత్, మధ్యప్రదేశ్, మిజోరం, ఒడిషా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో దీన్ని నిర్వహించింది. 9,867 మంది పిల్లల నుంచి వివరాలు సేకరించింది. సర్వేలో పాల్గొన్నవారిలో 41 శాతం మంది పిల్లలు టెక్నాలజీయే వాడలేదని, 8% మంది కొన్నాళ్లు వాడి మానేశారని తేలింది. ప్రాథమిక తరగతుల కంటే ఇతర తరగతులవారే సాంకేతికతను కొంతమేర వాడుతున్నారని తెలిపింది. టెక్నాలజీని వాడుతున్నవారిలో 89% మంది యూట్యూబ్‌పై ఆధారపడుతున్నారు. తర్వాతి స్థానాల్లో వాట్సప్, గూగుల్ ఉన్నాయి. ఎడ్‌టెక్ సాధనాలను ఎక్కువగా ఆంగ్లం, గణితం పాఠ్యాంశాల కోసం వాడుతున్నారు. సంక్లిష్టంగా ఉండే పాఠాలు సులభంగా అర్థం చేసుకునేందుకు ఎక్కువమంది సాంకేతికత వైపు చూస్తున్నారు. కొవిడ్ ఆంక్షల తర్వాత పాఠశాలలను తిరిగి తెరవటంతో తాము సాంకేతికతను వాడటం లేదని ఎక్కువమంది చెప్పారు. ట్యూషన్లకు వెళ్లటం వంటి కారణాలను ఇతరులు చెప్పారు.

## జాతీయ విద్యావిధానంపై హైదరాబాద్ టుడే కాంక్లేవ్



ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పల్లవి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ సంయుక్తంగా రెండు రోజులపాటు నిర్వహించిన హైదరాబాద్ టుడే కాంక్లేవ్ (హెచ్‌టీసీ)లో 'ట్రాన్స్‌ఫార్మింగ్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్' అనే అంశంపై ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రసంగించారు. విద్యా వ్యవస్థను మెరుగుపరచటానికి దేశవ్యాప్తంగా పలు పౌర సంస్థలు కృషి చేస్తున్నాయని, అనేకమంది వ్యక్తులు కెరీర్‌ను కూడా పక్కనపెట్టి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ దిశగా ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్, పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్స్ చేపడుతున్న వివిధ కార్యక్రమాలను యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగించుకోవాలన్నారు. జాతీయ విద్యావిధానం (ఎన్ఈపీ) అమలులో సవాళ్లు, అవకాశాలు, పరిష్కారాలపై లోతైన ఆలోచనాపరులు సూచనల్ని పంచుకోవటానికి ఒక వేదికగా ఈ కాంక్లేవ్ నిర్వహించినట్టు డీపీఎస్, పల్లవి గ్రూప్ విద్యాసంస్థల చైర్మన్ మల్కా కొమరయ్య తెలిపారు. ఎన్ఈపీకి సంబంధించిన హ్యాండ్ బుక్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విదేశాల నుంచి వచ్చిన విద్యావేత్తలు, నిపుణులు, వివిధ రాష్ట్రాల నుంచి 800 మందికిపైగా ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సమాజం బాగు గురించి కొంత పట్టించుకోండి

## -వైద్య కళాశాల సహాధ్యాయులకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి-



మిత్రులారా!

మనమంతా గుంటూరు వైద్య కళాశాలలో విద్యార్థులుగా చేరాక 50 ఏళ్లు గడిచాయి. మనలో సగం మందిమి 1972 ఏప్రిల్‌లో చేరాం. మరో సగం మంది బహుశా నవంబర్‌లో అనుకుంటా చేరారు. ఎంట్రెన్స్ ఆలస్యం కావటం చేత ఆ సంవత్సరం రెండు బ్యాచ్‌లు వచ్చాయి.

వెనక్కి తిరిగి చూస్తే, 50 ఏళ్లు గడిచినట్లు నమ్మటం కష్టం. ఏదో నిన్న, భయంభయంతో, జంకుతూ, సిగ్గుపడుతూ వైద్య కళాశాలకి వెళ్లినట్లు అనిపిస్తున్నది. మనలో చాలామందిమి గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చాం. జిల్లా పరిషత్ స్కూళ్ల నుంచి వచ్చాం. తెలుగు మీడియం నుంచి వచ్చాం. గుంటూరు మెడికల్ కాలేజీ అంటే చాలా గొప్ప విషయం మనందరికీ. మనలో చాలామంది కేవలం తల్లిదండ్రులు చెప్పారనో, స్కూల్‌లో మంచి మార్కులు వస్తున్నాయనో, లేకపోతే స్టెతస్కోప్, తెల్లకోటు చాలా గ్లామరస్‌గా ఉన్నాయనో మెడిసిన్‌లో ప్రవేశించాం. పెద్దగా ఆలోచించలా. చిన్ననాడే నిర్ణయాలు జరిగిపోయాయి. నా మట్టుకు నేను, 13 ఏళ్లకి పదవ తరగతి పూర్తవుతుండగా అమ్మ కోరింది.. ఒక్క కొడుకైనా డాక్టర్ కావాలని ఉంది అని. పోన్లే అని నేను కూడా చేరిపోయాను. అంతకంటే చిన్నవాళ్లున్నారు. మన గోపి ఉన్నాడు, 12 ఏళ్లకే టెన్త్ క్లాస్ పూర్తయింది.









చాలా చిన్న వయసులో నిర్ణయాలు తీసుకున్నాం మనం. కానీ ఆ గుంటూరు వైద్య కళాశాల మనకి ప్రపంచాన్ని చూపెట్టింది. విప్పారిన కళ్లతో సమాజాన్ని చూసే అవకాశాన్ని కల్పించింది. అప్పటిదాకా కూపస్థ మండూకాల్లా ఉన్న మనం మనకు నచ్చిన రంగంలోకి అభిరుచిని బట్టి ప్రవేశించే ప్రయత్నం చేశాం. హోప్ అండ్ హెల్ప్ దగ్గర ఎన్నికల చర్చలు జరిగినాయి. గాంధీయా, మార్క్సా?.. లేకపోతే దేశంలో అవినీతి వ్యతిరేక ఉద్యమాల మీద. ఎమర్జెన్సీ, ఇందిరాగాంధీ! గవాస్కరా లేకపోతే విశ్వనాథా? ప్రసన్నా, వెంకట రాఘవనా?.. రకరకాలైనటువంటి అంశాలు. సినిమాలు, సైన్స్ అండ్ టెక్నాలజీ, ప్రపంచంలో జరుగుతున్న సంఘటనలు. వియత్నాం యుద్ధం దగ్గర్నుంచి, ప్రచ్ఛన్న యుద్ధం దగ్గర్నుంచి, అమెరికా, సోవియట్ యూనియన్ మధ్య జరుగుతున్న సంఘర్షణ దగ్గర్నుంచి ప్రపంచమంతా అవలోకించాం, ఆలోచించాం, అభిప్రాయాలు ఏర్పరచుకున్నాం, వాదించుకున్నాం. కానీ అన్నిటినీ మించి స్నేహాలు పెరిగినాయి. చాలాకాలం మనం కళాశాలలో వైద్యంలో కలిసి ఉండటం చేత జీవితమంతా అనుబంధాలు పెరిగినాయి.

నాకింకా గుర్తు, గుంటూరులో చేరే నాటికి ఆడపిల్లలతో మాట్లాడాలంటే భయం. అప్పటిదాకా లయోలా కాలేజీలో కేవలం బాలుర కళాశాలలో చదువుకున్నాను. ర్యాగింగ్‌లో భాగంగా సీనియర్లెవరో నీకిష్టమొచ్చిన ఆడపిల్ల దగ్గరికి పోయి పేరు కనుక్కురావయ్యా అన్నారు. భయం, వణుకు, చెమట. తేరిపార చూస్తే అదృష్టం కొద్దీ ఒక తెల్ల కేసక్ వేసుకున్న నన్ ఒకామె కనిపించింది. వైద్య విద్యార్థినే. మీలో చాలామందికి గుర్తుండి ఉంటుంది. జోసెఫిన్ అని ఒకామె ఉండేది మనతోపాటు. నేను వెంటనే అమ్మయ్య అనుకుని ఆవిడ దగ్గరికి వెళ్లి, సిస్టర్ మీరు ఏమీ అనుకోవద్దు, మీ పేరేంటో చెబుతారా, వాళ్లు అడుగుతున్నారు నన్ను కనుక్కోమని అన్నాను. సిస్టర్ జోసెఫిన్ అని చెప్పింది. వాళ్లంతా తెగ తిట్టారు. ఏవయ్యా, అవకాశం వస్తే నువ్వు నన్ దగ్గరికి పోయి అడుగుతావా, ఇంకెవ్వరూ లేరా అని. అలాంటి పరిణతి

లేనటువంటి బాల్యం నుంచి మనం ప్రపంచాన్ని ఎదుర్కొనేటువంటి యోధులుగా తయారైనాం.

ఇక వృత్తి నైపుణ్యం విషయానికొస్తే, గుంటూరులో ఆనాడు అద్భుతమైన అధ్యాపకులున్నారు. క్లినికల్ ఎక్యుమెన్. మనకు అపారమైనటువంటి ధైర్యాన్ని ఇచ్చినవాళ్లు. పుస్తకాలు బాగా చదివినా, చదవకపోయినా బెడ్‌సైడ్ ద్వారా బాగా నేర్చుకున్నాం. మన సహాధ్యాయులుగానీ, సీనియర్లుగానీ, మన అధ్యాపకులు గానీ, బోలెడంత ఆత్మవిశ్వాసాన్ని నింపారు మనకి. భవిష్యత్తు పట్ల నమ్మకంతో ఎదిగాం. వైద్యం పూర్తయ్యే నాటికి మనం మంచి డాక్టర్లం కాగలం, మంచి భవిష్యత్తు మనకు ఉందనే నమ్మకం మన కుండింది. కానీ ఈవేళ గనక విద్యార్థుల్ని మనం చూసినట్లయితే, వైద్యంలో చేరినప్పుడు అద్భుతమైనవాళ్లు, మెరికల్లాంటివాళ్లు. చాలా గట్టి పోటీలో వస్తున్నారు. తెలివి ఉంది, ప్రపంచాన్ని చూసినటువంటి అనుభవం మనకంటే ఎక్కువ ఉంది ఈవేళ్టి సోషల్ మీడియా, ఇంటర్నెట్ యుగం వల్ల. కానీ క్లినికల్ స్కిల్స్ రావటం లేదు. వైద్యంలో చేరాక చాలా బిడియంగా ఉంటున్నారు. భయంగా ఉంటున్నారు. చాలా డిప్రెషన్‌కి గురవుతున్నారు. ఆ ఆత్మవిశ్వాసం రావటం లేదు. మనందరం ఎంతోకొంత పూనుకోవాలి ప్రస్తుత వైద్య వృత్తిలో ఏం చేయాలి అనే అంశంలో.

ఇక ఆరోగ్యం. ప్రభుత్వాస్పత్రుల్ని చూశాం కాబట్టి, నిరుపేదల్ని చూశాం కాబట్టి, ఆరోగ్యానికి-వైద్యానికి మధ్య తేడా మనందరికీ స్పష్టంగా అర్థమైంది. ఎంత డాక్టర్లున్నా, ఎంతటి నైపుణ్యం ఉన్నా మంచి ఆరోగ్యం కావాలంటే మిగతావి కావాలి. మంచినీళ్లు కావచ్చు, పౌష్టికాహారం కావచ్చు, పారిశుద్ధ్యం కావచ్చు, ఇతర పరిస్థితులు కావచ్చు.. ఇవన్నీ లేకపోతే కేవలం డాక్టర్లు, నర్సుల వల్ల ఆరోగ్యం బాగుపడదన్న విషయం మనకు స్పష్టంగా అర్థమైంది. ఆ రోజుల్లోనే నేను రజనీకాంత్ అరోలి నుంచి ప్రత్యక్షంగా స్ఫూర్తిని పొందాను. రజనీకాంత్, మేబెల్ అరోలి దంపతులు ఇద్దరూ కూడా సీఎంసీ వెల్లూరులో పట్టభద్రులై అక్కడ్నుంచి నేరుగా జాన్స్ హాప్కిన్స్‌కి వెళ్లి అక్కడ మాస్టర్స్ చేసి మహారాష్ట్రలోని మారుమూల ప్రాంతంలో, వాళ్ల స్వస్థలం జాంఖేడ్‌లో ఒక ఆరోగ్య వ్యవస్థని ఏర్పాటు చేశారు. చాలా ప్రామాణికమైనది. నేను ఆనాడు వాళ్లని దర్శించినప్పుడు కలలు గన్నాను. ఒక పదేళ్లలో దేశమంతా ఇలాంటి ఆరోగ్య వ్యవస్థ వస్తుందని. కానీ 50 ఏళ్లు గడిచినా ఇప్పటికీ పెద్దగా మారలేదు. టెక్నాలజీ వల్ల వచ్చిన మార్పులొస్తున్నాయి, వనరులు పెరగటం వల్ల మరికొంత అవకాశాలు పెరిగినాయి. కానీ సరైన ఆరోగ్య వ్యవస్థ ఈనాటికీ ఏర్పడలేదు.

విద్య, ఆరోగ్యం - ఈ రెంటిలో రావలసిన మార్పులు నన్ను ఇప్పటికీ దహించి వేస్తున్నాయి. ఒకటి, మనందరం గ్రామీణ పాఠశాలల్లో చదువుకున్నాం, తెలుగు మీడియంలో చదువుకున్నాం. ఆ రోజుల్లో పెద్దగా మౌలిక సదుపాయాలు లేకున్నా, అధ్యాపకులకు పెద్ద జీతభత్యాలు లేకున్నా, మన తల్లిదండ్రులకు అంతగా చదువులేకున్నా మనందరం చాలా అదృష్టవంతులం. మన ప్రతిభ వికసించింది. ప్రపంచంలో ఒక స్థానాన్ని సంపాదించుకున్నాం. మనకు నచ్చిన రంగంలో ఎదగగలిగాం. గౌరవప్రదమైన జీవితాన్ని గడపగలిగాం. కానీ ఆనాటితో పోలిస్తే పది రెట్లు, ఇరవై రెట్లు, ముప్పై రెట్లు ఖర్చు ఎక్కువ పెడుతున్నా, మౌలిక సదుపాయాలు బాగున్నా ఈవేళ మన స్థానాలలో ఆ స్కూళ్లలో చదువుతున్న పిల్లల్లో నూటికి 80, 90 మందికి అసలు భవిష్యత్తు లేదు. కనీస ప్రమాణాల విద్య అందటం లేదు. అట్లాగే ఈనాటికీ ఆరోగ్యం అందక ఈ దేశంలో ఏడాదికి 6 కోట్ల మంది నిరుపేదలవుతున్నారు. ఏడాదికి 6 కోట్ల మంది! అంటే సంవత్సరం మొదట బీదలు కానివారు కేవలం అనారోగ్యం కారణంగా, నివారించదగ్గ అనారోగ్యం కార ణంగా నిరుపేదలవుతున్నారు. అయితే ఖర్చు భరించలేక.. లేకపోతే సరైన వైద్య చికిత్స అందక! వైద్య సేవలందక, మంచాన పడుండటం చేత ఆదాయాన్ని కోల్పోతున్నారు. ఇంతకంటే దారుణం మరొకటి లేదు. నా దృష్టిలో ఈ రెండూ భయంకరమైనటువంటి పాపాలు.

దేవుడున్నాడో లేదో నాకు తెలియదు. నేను గుంటూరు వైద్య కళాశాలలో చేరినప్పటికే బెర్ట్రండ్ రస్సెల్ ప్రభావం వల్ల.. దేవుడి సంగతి మనకనవసరం, మనిషి ఉన్నాడు, మానవ సమాజం ఉంది. మనిషి ముందు ఎన్నో అవకాశాలున్నాయి, ఆశలున్నాయి, కష్టాలున్నాయి, నివారించదగ్గ క్లేశాలున్నాయి.. ఆ క్లేశాల్ని నివారించటం, ఒక మంచి సమాజ నిర్మాణం చేయటమే మనందరి కర్తవ్యం అని ఒక స్పష్టమైన అవగాహనకొచ్చాను. కాబట్టి దేవుడితో నిమిత్తం లేకుండా పాపాలు మాత్రం ఉన్నాయని నేను నమ్ముతున్నాను. మొట్టమొదటిది, ఏ కుటుంబంలో పుట్టినా, ఏ కులంలో పుట్టినా ఓ బిడ్డ శక్తిసామర్థ్యాలు వికసించకపోతే, ప్రకృతి ఇచ్చిన ప్రతిభాపాటవాలు వికసించకపోయినట్లయితే అది నిజంగా భయంకరమైన పాపం. మన సమాజంలో ఆ పాపం పుష్కలంగా ఉంది. అలాగే రెండోది, నివారించదగ్గ బాధ. నివారించదగ్గ క్లేశం. నివారించలేని క్లేశాన్ని గురించి మనం ఏం చేయలేం, దుఃఖపడటం తప్ప. కానీ నివారించగలిగి, నివారించకపోతే, అనారోగ్యం రాకూడనివి వస్తే, దాన్ని తేలిగ్గా ఆపగలిగినా ఆపకపోతే, చికిత్స ఉండి కూడా అందక చాలామంది బాధపడుతూ ప్రాణాలు కోల్పోతుంటే, ఉత్పాదకత తగ్గిపోతుంటే, బీదరికంలో మగ్గిపోతుంటే.. అంతకంటే పాపం మరొకటి లేదు. ఈ రెండు పాపాలూ భయంకరమైనవి. మనందరి జీవితంలో ఈ పాపాలకతీతంగా మనం ఎదగగలిగాం. మనం అదృష్టవంతులం. మన తర్వాతి తరానికి ఆ అవకాశాన్ని కల్పించాలి.

ఇక ఈ దేశం గూర్చి. మన దేశం గూర్చి, మన సమాజం గూర్చి, మానవాళి గూర్చి ఎన్నో ఆలోచనలు చేశాం. నాకిప్పటికీ గుర్తుంది. 1973-74 ప్రాంతంలో మన దేశంలో అవినీతి వ్యతిరేక ఉద్యమాలు ప్రారంభమైనాయి. అవినీతి, పేదరికం, నిరుద్యోగం ఈ మూడూ ప్రధాన సమస్యలుగా కన్పించాయి జనాభా పెరుగుదలతో పాటు. జనాభా పెరుగుదలను కాస్త అరికట్టగలుగుతున్నాం. ఆలస్యంగానైనా కూడా జననాల రేటు తగ్గుతున్నది, ఫెర్టిలిటీ రేట్లు తగ్గుతున్నాయి. కచ్చితంగా ఇంకో 15-20 ఏళ్లలో మన దేశ జనాభా పెరుగుదల ఆగిపోతుంది. బహుశా 160 కోట్ల దగ్గరికి వెళ్లి ఆగిపోతుంది. దేశంలో అన్ని ప్రాంతాల్లో, అన్ని వర్గాల్లో ఈ తగ్గుదల కనిపిస్తోంది జననాల రేటులో. కానీ మిగతా సమస్యలు ఇప్పటికీ

కొనసాగుతున్నాయి. 1974-75 ప్రాంతాల్లో ఆ ఉద్యమాలకి అప్పటి ప్రభుత్వాలు, అప్పటి నాయకత్వం విచక్షణతతో స్పందించకుండా దమననీతిని ప్రయోగించాయి. ఎమర్జెన్సీ వచ్చింది. మనమంతా హతాశులమైనాము. నా మట్టుకు నాకు నా జీవితాన్ని మార్చింది ఆ ఎమర్జెన్సీ. 1974లో అమెరికాలో రిచర్డ్ నిక్సన్ వాటర్‌గేట్ ఉదంతంతో రాజీనామా చేశాడు ఆగస్టు 8వ తారీఖున. నాకిప్పటికీ చాలా స్పష్టంగా గుర్తుంది- వాటర్‌గేట్ ఉదంతంలో ఏం జరుగుతోందో ప్రతిరోజూ నేను గమనించేవాడ్ని పత్రికలు, రేడియో ద్వారా. ఆగస్టు 11న మన కాలేజీ మ్యాగజైన్‌కి ఎడిటోరియల్ రాశాను. ఇంగ్లీషు సెక్షన్‌లో. ఆనాడే స్పష్టంగా నా మనసులో భావాల్ని అందరిముందూ పెట్టాను. మన ప్రజాస్వామ్యంలో ఉన్న లోపాలు, దాన్ని సరిదిద్దటానికి మనం చేయాల్సిన పోరాటం.. అప్పట్నుంచి ఇప్పటి దాకా అదే నా గమనాన్ని నిర్దేశించింది. ఆనాటి కంటే పరిణతి పెరిగి ఉండొచ్చు, కొంత జ్ఞానం అబ్బి ఉండొచ్చు, అనుభవం వచ్చి ఉండొచ్చు, కానీ మౌలికంగా నా యాత్ర ఆనాడే ప్రారంభమయింది.

1977లో ఎన్నికలు జరిగాయి. మార్చి 21న. మన రాష్ట్రంలో, తెలుగునాట ఒక సీటులో తప్ప అన్ని చోట్లా కాంగ్రెస్ ప్రభంజనం వీచినా, ఉత్తరాదిన ప్రజలంతా నియంతృత్వానికి ఎదురుతిరిగారు. అద్భుతమైన గాంధేయ విప్లవం వస్తుందని ఆశపడ్డాం మనమంతా కూడా. మనలో చాలామందిమి ఆనాడు వెర్రి ఆనందంతో నృత్యం చేశాం. ఎక్స్‌టసీ అంటాం.. అది అనుభవించాం. ఆ ఆనందాన్ని అనుభవించాం. కానీ ఎక్కువకాలం నిలవలేదు. చాలా త్వరగానే అర్థమైంది.. ఆటగాళ్లు మారారు, ఆట నియమాలు మారలేదు, పరిస్థితులేమీ చక్కబడలేదు అని. ఇప్పటికీ ఈ దేశంలో మౌలికమైన మార్పులకి మనం మరింత పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. మధ్యలో చాలా సాధించాం ఒక దేశంగా. ఆహారంలో స్వయంసమృద్ధి వచ్చింది, మనం వైద్యంలో చేరినప్పుడే ప్రారంభమైంది ఆ స్వయంసమృద్ధి. అట్లాగే ఎంతో కొంత ఆర్థికంగా కొంత పెరిగాము, అనుకున్నంత కాకపోయినా. అంతకుముందున్న లైసెన్స్-పర్మిట్ రాజ్యాన్ని కాస్తంత పక్కనపెట్టి సంస్కరణలకు పునాది వేశాం. కొన్ని మంచి ఫలితాలొచ్చినాయి. కానీ ఇంకా చాలా సంస్కరణల్ని చేయాల్సి ఉంది. ఇంకా ఆర్థిక ప్రగతిని సాధించాల్సి ఉంది. విద్య, ఆరోగ్యం ఇప్పటికీ అందటం లేదు, ఇప్పటికే అనుకున్నాం. చట్టబద్ధపాలన లేదు, బడితె ఉన్నవాడిదే బర్రె ఇప్పటికి కూడా. ఎన్నికల్లో ఆనాడే చాలా దుర్మార్గంగా ఉంది, అవినీతి ఉందనుకుంటే.. ఈవేళ అసలు పోల్చుకోలేం. ఎలక్షన్లలో ఎంత ఖర్చవుతుందో తెలుగునాట మనందరికీ తెలుసు. చాలా రాష్ట్రాల్లో ఏం జరుగుతోందో చూస్తున్నాం. డబ్బు, తాయిలాలు, కుల, మత విభజనలు, ప్రాంత విభజనలు.. ఇవే రాజకీయంలో ఆలంబన అయినాయి. మన దేశంలో మౌలికమైన మార్పులు ఇంకా తేవలసిన అవసరం ఉంది. ఇది చాలా వేగంగా వస్తాయని నాలాంటివాళ్లం నమ్మాం.

నేను ఆశావాదిని. కచ్చితంగా మంచి మార్పులు వస్తాయని నాకు తెలుసు. కానీ ప్రజాస్వామ్యంలో పరిణామం అంత వేగంగా జరగదని అనుభవం పాఠాలు నేర్పింది. ఇది తరాల కాలం పోరాటం. బహుశా మరోతరం కాలం పడుతుంది ఈ మౌలికమైన మార్పుల్ని పూర్తిగా సాధించటం కోసం. కానీ ఎప్పుడూ లేనంత అద్భుతమైన అవకాశాలు ఇప్పుడు ఉన్నాయి. ప్రపంచంలో మానవాళి అవసరాలు మొత్తాన్నీ తీర్చేటువంటి అవకాశం, ఎదిగే అవకాశాల్ని అందరికీ ఇచ్చేటువంటి అవకాశం తొలిసారిగా మన తరానికి, మన తర్వాత తరానికి ఉన్నాయి. మన దేశానికే కాదు ప్రపంచమంతా కూడా. మనం చాలా అదృష్టవంతమైన కాలంలో ఉన్నాం. ది బెస్టాఫ్ ఆల్ ది పాజిబుల్ వరల్డ్స్. వచ్చే 25 ఏళ్లలో ఈ మార్పుల్ని సాధించగలం.

మన శేష జీవితాన్ని మనం ఆనందంగా మన కుటుంబంతో, మన మిత్రులతో గడుపుతూనే ఎక్కడున్నా సరే, ఈ సమాజాన్ని బాగుచేయటం గురించి కొంత పట్టించుకోవాలి. మానవ సమాజానికున్న అవకాశాల్ని పూర్తిగా వినియోగించుకుంటూ ఒక తరం కాలంలో నివారించదగ్గ క్లేశాన్ని తొలగించటం, అందరికీ ఎదిగే అవకాశాలని అందించటం.. ఇవి మన లక్ష్యాలు కావాలి. మనలో చాలామందిమి ఇంకో 25 ఏళ్లు బతుకుతామన్న నమ్మకం నాకుంది. అంటే 2047 కూడా చూసే అవకాశం ఉంది అని నేను నమ్ముతున్నాను. అంటే సరిగ్గా స్వతంత్ర భారతానికి వందేళ్లవుతున్నాయి. ఆనాటికి చాలా సమస్యలు ఈవేళున్నవి, పరిష్కారానికి అనువైన సమస్యలు పరిష్కారమవుతాయని నేను నమ్ముతున్నాను. మళ్లీ కొత్త సమస్యలు వస్తాయి. కొత్త ఇబ్బందుల్ని సృష్టించుకుంటారు. కానీ పాత ఇబ్బందులు, పాత సమస్యలు వేధించకూడదు. వచ్చే తరం కొత్త ఇబ్బందులు సృష్టించుకోనివ్వండి, వాళ్లని పరిష్కరించుకోనివ్వండి. మనం మాత్రం మన తర్వాతి తరాలకి అపరిష్కృతంగా, చాలాకాలంగా కొనసాగుతున్న సమస్యలని అందించకూడదు. ఆ ప్రయత్నం జరుగుతుందని మనసారా విశ్వసిస్తున్నాను.

మీ అందరూ ప్రపంచంలో ఎక్కడ ఉన్నా మన దేశానికి, మన కాలేజీకి, తెలుగు నేలకి బోలెడంత కీర్తిని తెచ్చారు, గౌరవాన్ని తెచ్చారు, స్ఫూర్తిని ప్రసాదించారు. మీరంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని మనసారా ఆశిస్తున్నాను. నా అనుభవాలు, మీ అనుభవాలు వేరు కాదు. మనందరివి ఒకటే అనుభవాలు. కాకపోతే పరిస్థితులను బట్టి, అభిరుచులను బట్టి, ఆనాటి సందర్భాన్ని బట్టి, ఎంచుకున్న దారిని బట్టి మన అనుభవాలు మారుండొచ్చు. మనం కోరుకుంటున్నటువంటి దారి కాస్త మారి ఉండొచ్చు, కానీ లక్ష్యాలు మాత్రం ఒక్కటే. ఆ లక్ష్యాలే అప్పటికి, ఇప్పటికీ మనల్ని ప్రేరేపిస్తున్నాయి. కచ్చితంగా గుంటూరు వైద్య కళాశాల ప్రాభవం నిలబెట్టటంతోపాటు మనందరం మన మన సమాజాల్లో మరింత మేలైన మార్పుల కోసం కృషి చేస్తామని ఆశిస్తున్నాను.

**ఐ విష్ యు ఆల్ ది వెరీ బెస్ట్. థాంక్యూ.**

**(గుంటూరు మెడికల్ కాలేజీలో విద్యార్థులుగా జేపీ బ్యాచ్ చేరి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వెలువరించిన ప్రత్యేక సంచిక నుండి)**

# లక్షల మంది వైద్యులు ఖాళీగా, అనారోగ్యం అన్ని దిక్కులా..
# అయినా కొత్త మెడికల్ కళాశాలలంటూ మభ్యపెడుతున్న ప్రభుత్వాలు





తాము చదువుకునే రోజుల్లో ఎంబీబీఎస్‌లో 50 శాతం కంటే తక్కువమంది ఉత్తీర్ణులయ్యేవారని, ఇప్పుడు ఆ సంఖ్య 90 శాతం దాటినా పరిజ్ఞానంలో తప్ప వైద్య సేవల్లో పట్టు సాధించలేకపోతున్నారని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. గుంటూరు వైద్య కళాశాల 2017 బ్యాచ్ విద్యార్థుల స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా జేపీ మాట్లాడుతూ, గతంలో ప్రతి ఒక్కరూ వైద్యులను ఎంతో గౌరవంగా చూసేవారని, ఇప్పుడు డాక్టర్లలో వ్యాపార ధోరణి పెరుగుతోందన్న విమర్శ నానాటికీ పెరుగుతోందన్నారు. దీనివల్ల వైద్యులు-రోగుల బంధం క్రమంగా బీటలు వారుతోందన్నారు. ప్రభుత్వాల విధానపరమైన వైఫల్యం ఇందుకు కారణమన్నారు. వైద్యుల కొరత వల్ల మన దేశంలో ప్రజలకు సరైన వైద్యం అందటం లేదన్న వాదన అర్థరహితమన్నారు. దేశంలో సుమారు 13 లక్షల మంది శిక్షణ పొందిన డాక్టర్లు ఉన్నారని, ఏటా 90,000 మంది ఎంబీబీఎస్ పట్టాతో బయటకు వస్తున్నారని తెలిపారు. వీరిలో సుమారు మూడు లక్షల మంది పెద్దగా పనిలేకుండా ఉన్నారన్నారు. వీరి సేవల్ని ఉపయోగించుకుని ప్రజలకు ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించే ప్రయత్నం చేయకుండా ప్రభుత్వాలు విచిత్రంగా కొత్త వైద్య కళాశాలల్ని ప్రారంభిస్తున్నాయన్నారు. ప్రభుత్వాల ఈ అపసవ్య ధోరణుల వల్ల ఏటా దాదాపు ఐదున్నర కోట్ల మంది దేశంలో పేదరికంలోకి జారిపోతున్నారని, ఆంధ్రప్రదేశ్‌లోనే సుమారు 25 లక్షల మంది ఇలా పేదలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో వైద్యులు, తక్కువ ధరలో మందులు వంటి వనరులు ఉన్నా ప్రజలకు మాత్రం వైద్యం అందటం లేదన్నారు. పేదరికాన్ని తొలగించాలన్నా, దేశ ఉత్పాదక శక్తిని పెంచాలన్నా ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తేవటమే మార్గమని, ప్రతి పౌరునికీ మంచి ప్రమాణాల వైద్యం ఆధునిక ప్రజాస్వామ్య ప్రభుత్వ బాధ్యతని స్పష్టం చేశారు. ఈ సంక్షోభంపై వైద్యులు, వైద్య విద్యార్థులు కూడా దృష్టి సారించాలని, ప్రభుత్వ సమగ్ర వైద్య విధానాన్ని అమలు చేస్తే డాక్టర్లు, ఇతర సిబ్బందికి కూడా కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయన్నారు. తమ ఉద్యోగాలు పోతాయని కొన్ని వృత్తులలో ఉన్నవాళ్లు ఆందోళన చెందుతున్నారని, కానీ వైద్య వృత్తిలో ఉన్నవారికి ఎప్పటికీ డిమాండ్ ఉంటుందన్నారు. అలాగే ఎంబీబీఎస్ అనంతరం సీట్లు తక్కువగా ఉన్నందున వైద్యులు చాలామంది ఆందోళన చెందుతున్నారన్నారు. ఆ కోర్సులు చేసిన కొద్దిమంది వైద్యులకే లబ్ధి కలిగేలా ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. వందమంది ఎంబీబీఎస్ డాక్టర్లు వస్తుంటే కేవలం 25 మందే పీజీ చేస్తున్నారన్నారు. పీజీ సీట్లు పెంచి నిపుణులైన వైద్యులు సమాజంలో అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ పద్మావతి దేవి, సూపరింటెండెంట్ ప్రభావతి, డిప్యూటీ సూపరింటెండెంట్లు పద్మశ్రీ, సంధ్యావళి, ఆచార్యులు రామకృష్ణారెడ్డి, రమణ యశస్వితోపాటు పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. 'జింకాన అందించిన సాయంతో కళాశాలలో ఆడిటోరియం, సర్వజనాస్పత్రిలో పొదిల ప్రసాద్ భవనాన్ని నిర్మించారు. తాజాగా మాతా శిశు సంరక్షణ భవనానికి రూ.86 కోట్లు సాయం అందించారు. అందువల్ల ఇక్కడ చదివిన విద్యార్థులు తమ మాతృసంస్థ అభివృద్ధికి పాటుపడాలి' అని అతిథులు సూచించారు.

**అనంత వైద్య కళాశాలలో..**

వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, రోగుల పట్ల వైద్యులు మానవత్వంతో వ్యవహరించాలని జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. అనంతపురం వైద్య కళాశాల 2017 బ్యాచ్ విద్యార్థుల ఎంబీబీఎస్ కోర్సు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైద్యులలో స్పందించే శక్తి ఉన్నప్పుడే ప్రజలకు మెరుగైన వైద్యం అందించగలరన్నారు. కేవలం డబ్బు కోసం కాకుండా సమాజం కోసం కూడా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. వృత్తి విలువలను ఎన్నడూ మరువకూడదన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీదేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ సుబ్రహ్మణ్యం, ప్రజారోగ్య పరిరక్షణ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొండయ్య, ప్రొఫెసర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఏడాదికి 322 రోజులు అప్పులతో సర్దుబాటు

2021-22 ఆర్థిక సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 322 రోజుల పాటు రిజర్వు బ్యాంకులో కనీస నగదు నిల్వ నిర్వహించలేక వేరే మార్గాల్లో సర్దుబాటు చేయాల్సి వచ్చిందని 'కాగ్' నివేదిక-2023 తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌బీఐ వద్ద రోజువారీ కనీస నిల్వ రూ. 1.94 కోట్లు ఉండేలా చూసుకోవాలి. అంగీకరించిన నగదు నిల్వల కన్నా ఏ రోజయినా తగ్గితే.. ఆ మొత్తాన్ని వేస్ అండ్ మీన్స్ (చేబదుళ్లు) అడ్వాన్సులు, ప్రత్యేక డ్రాయింగ్ సదుపాయం, ఓవర్ డ్రాఫ్ట్ రూపంలో భర్తీ చేయాల్సి ఉంటుంది. ఇందుకు కూడా పరిమితులుంటాయి. ఇలా వివిధ రూపాల్లో ఆర్‌బీఐ కల్పించే వెసులుబాటును ఉపయోగించుకోవటమూ ఒక రకంగా రుణం తీసుకోవటమే. ఈ మొత్తం తిరిగి చెల్లించే క్రమంలో దానిపై వడ్డీ కూడా చెల్లించాల్సి ఉంటుంది.

'రాష్ట్ర ప్రభుత్వం తరచుగా వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులు, ప్రత్యేక డ్రాయింగ్ సదుపాయం, ఓవర్ డ్రాఫ్టులు వినియోగించే ఆగత్యాన్ని తగ్గించటంతోపాటు తమ నగదు నిర్వహణ వ్యవస్థను పటిష్ఠం చేసే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించాలి' అని కాగ్ సూచించింది.

+ వివిధ సామాజిక ఆర్థికాభివృద్ధి పథకాలకు నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రుణాల మీద ఆధారపడకుండా రెవెన్యూ వనరులను సమకూర్చుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేయాలని కాగ్ సిఫార్సు చేసింది. ఆస్తుల కల్పనకు, ఆర్థికాభివృద్ధిని వేగవంతం చేసేందుకు మూలధన వ్యయాన్ని గణనీయంగా పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ఆశించిన ప్రయోజనాలు పొందాలంటే నీటిపారుదల పథకాలను త్వరితగతిన పూర్తిచేయాలని కూడా సిఫార్సు చేసింది.

+ ఎఫ్ఆర్‌బీఎం నిబంధనల పాటింపుకి, నిధుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని ధ్రువీకరించేందుకు ప్రభుత్వ పథకాల అమలుకు ప్రత్యేక ప్రయోజన వాహక సంస్థలను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలు, స్వయంప్రతిపత్తి గల సంస్థల ద్వారా తీసుకున్న బడ్జెటేతర రుణాలను రాష్ట్ర ప్రభుత్వం సరైన రీతిలో వెల్లడించాల్సిన అవసరం ఉందని కాగ్ పేర్కొంది.

◆

## తలసరి అప్పు రూ.92,797

రాష్ట్ర ప్రభుత్వ అధికారిక అప్పుల లెక్కల ప్రకారం 2022 మార్చి నాటికి రాష్ట్రంలో ప్రతి ఒక్కరిపైనా రూ. 92,797 రుణభారం ఉందని కాగ్ తేల్చింది. 2021-22 చివరి నాటికి మొత్తం అప్పులు అధికారిక లెక్కల ప్రకారం రూ. 3,72,503 కోట్లుగా పేర్కొంది. వీటికి బడ్జెటేతర అధికారిక రుణాలు రూ. 1,18,393 కోట్లను జత చేసింది. బడ్జెటేతర రుణాలు కలిపి పరిగణించకపోతే తలసరి అప్పు రూ. 70,416 గాను, వాటిని కూడా కలిపితే రూ. 92,797 గాను ఉంటుందని లెక్కించింది. వివిధ కార్పొరేషన్ల నుంచి రుణాలు తీసుకుంటున్నా చట్ట ప్రకారం వాటిని ఆడిట్ చేసి ఆ నివేదికలను సమర్పించటం లేదని కాగ్

# డ్రగ్స్‌తో భవిష్యత్తును దెబ్బతీసుకోవద్దు

యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలతో తమ భవిష్యత్తుని దెబ్బతీసుకోవద్దని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు. బాపట్ల ఇంజనీరింగ్ కాలేజీలో విద్యార్థులకు మోటివేషనల్ టాక్ అవేర్‌నెస్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మన విద్యార్థుల్లో తెలివితేటలకు కొదవ లేదన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు లక్ష్యంతో చదువుకుని మంచి ఆదాయాలున్న ఉపాధి అవకాశాలను పొందాలన్నారు. దేశంలో వనరులు పుష్కలంగా ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకునే బాధ్యత విద్యార్థులు, యువతపై ఉందన్నారు. సరైన దిశలో, డిజిటల్ స్కిల్స్‌తో కృషి చేయాలన్నారు. ప్రపంచ దేశాలు భారత్‌లోని యువత వైపు ఆసక్తిని కనబరుస్తున్నాయని తద్వారా వచ్చే నాణ్యమైన ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థుల ఆలోచనా స్థాయి, జీవనశైలి మారటానికి నాణ్యమైన చదువే ప్రామాణిక మార్గమన్నారు. సమాజంలో కుల, మత, వర్గాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు ముప్పలనేని శ్రీనివాసరావు, మానం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు-1 దొప్పలపాటి రామ్మోహనరావు, ఉపాధ్యక్షుడు-2 గెల్లి దిలీప్ కుమార్, జాయింట్ సెక్రటరీ కొమ్మినేని హరిపద్మప్రసాద్, కళాశాల ప్రిన్సిపల్ డా॥ షేక్ నజీర్, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎగుమతుల స్థానికీకరణ.. నూతన ఎఫ్‌టీపీ లక్ష్యం సాకారమయ్యేనా?



ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కొత్త విదేశీ వాణిజ్య విధానం (ఎఫ్‌టీపీ) ఏప్రిల్ నుంచి అమల్లోకి వచ్చింది. దేశ ఎగుమతులను 2030 కల్లా 2 లక్షల కోట్ల డాలర్లకు (సుమారు రూ.164 లక్షల కోట్లు) పెంచుకోవటం ఈ విధానం లక్ష్యమని యూనియన్ ప్రభుత్వం ప్రకటించింది.

అయిదేళ్ల కాలవ్యవధితో 2015లో ప్రకటించిన ఎఫ్‌టీపీ ఆ తర్వాత కొవిడ్ కారణంగా 2022 సెప్టెంబర్ దాకా వాయిదా పడుతూ వచ్చింది. ఆ తర్వాత మూడేళ్ల కాలవ్యవధితో ఎఫ్‌టీపీని ప్రకటించాలని ప్రభుత్వం భావించినా.. చివరికి ఎటువంటి గడువూ లేకుండా కొనసాగేలా, పరిస్థితుల ఆధారంగా ఎప్పటికప్పుడు మార్పులు చేసుకునేలా (డైనమిక్ అండ్ రెస్పాన్సివ్) కొత్త విదేశీ వాణిజ్య విధానాన్ని 2023లో మార్చి నెలాఖరున ప్రకటించింది. మన చుట్టూ ఉన్న కొన్ని దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని, భూగోళం మీది మరికొన్ని దేశాలు మాంద్యం పరిస్థితుల్ని ఎదుర్కొంటూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనిశ్చితి పరిస్థితిని ఎదుర్కొంటున్న దశలో, యువ భారత్‌కి ఆర్థిక వృద్ధికి ఎంతో కీలకమైన దశలో, ఎన్నో ఆశల మధ్య వచ్చిన ఎఫ్‌టీపీలో కొన్ని సానుకూల, వినూత్న అంశాలున్నా ఇంకా పాత లైసెన్స్ రాజ్ వాసనలు పోలేదనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి.

జిల్లాల్ని ఎగుమతి కేంద్రాలుగా అభివృద్ధి చేయాలన్నది కొత్త ఆలోచన. వికేంద్రీకరణ, అందులో భాగంగా స్థానిక ఉత్పత్తులు, రాష్ట్రాలతో సమన్వయం, రాష్ట్రాల మధ్య పోటీని పెంచటం చెప్పుకోదగిన అంశాలు. దేశంలో కొన్ని జిల్లాలు కొన్ని రకాల ఉత్పత్తులకు బ్రాండ్ ఇమేజ్ కలిగివున్నాయి. అటువంటి జిల్లాలను పరిగణలోకి తీసుకొంటూ, ఆయా జిల్లాల్లో తయారయ్యే ఉత్పత్తులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించనుంది. ఇది సరిగా అమలు చేస్తే ప్రాంతీయ అసమానతల్ని సమర్థవంతంగా నియంత్రించవచ్చని నిపుణులు చెబుతున్నారు. అలాగే మౌలిక వసతులు, సులభతర వాణిజ్యం ప్రాధాన్యతల్ని స్పష్టంగా గుర్తించారు. కొత్త రంగాలను గుర్తించాలనుకోవటం ఎంతో అవసరమైన పరిణామం.

గతంలో టీఈఈ పథకం కింద దేశంలోని 39 పట్టణాల నుంచి ఎగుమతుల వృద్ధికి మౌలిక వసతులు, రాయితీలు కల్పించారు. ఇకపై మీర్జాపూర్, ఫరీదాబాద్, మొరాదాబాద్, వారణాసిల నుంచీ ఎగుమతుల పెంపుకి కృషి చేస్తారు. టీఈఈ పట్టణాలకు సులభ మార్కెటింగ్ కార్యక్రమం ద్వారా నిధులు అందిస్తారు. గణనీయంగా ఎగుమతులు చేపట్టిన సంస్థలకు 2 స్టార్, అంతకు మించి రేటింగ్ ఇస్తున్నారు. ఇలాంటి సంస్థలు – విదేశీ వాణిజ్యానికి సంబంధించి వ్యక్తులు, సంస్థలకు శిక్షణ ఇచ్చేందుకు కొత్త విధానం వీలు కల్పిస్తుంది. అయితే, మౌలిక వసతుల విషయంలో మరింత సమగ్ర దృష్టితో ఆలోచించి చిన్న పట్టణాల అభివృద్ధి విధానంతో సంధానం చేసి ఉంటే బహుముఖ ప్రయోజనకరంగా ఉండేది.

అలాగే కొందరు విమర్శకుల దృష్టిలో, 2004లో తొలిసారిగా ఎఫ్‌టీపీని ప్రవేశపెట్టినప్పుడు తీసుకున్న ఫార్మాట్‌నే తాజాగా కూడా యథాతథంగా కొనసాగించారు. అప్పట్లోలాగే 1992 విదేశీ వాణిజ్య (అభివృద్ధి, నియంత్రణ) చట్టానికి అనుగుణంగానే ఇప్పుడూ ఎఫ్‌టీపీలో అంశాలను పొందుపరిచారు. వాణిజ్య వృద్ధి, ఆంక్షలు లేని వాణిజ్యానికి ప్రాధాన్యతకన్నా విదేశీ వాణిజ్య నిబంధనలు, నియంత్రణల ప్రస్తావన ఎక్కువగా ఉంది. ఐరోపా యూనియన్, ఇండో–పసిఫిక్ ఆర్థిక చట్రం వంటి ఒప్పందాల చర్చల్లో భారత్‌తో ఇతర దేశాలు ప్రస్తావిస్తున్న ప్రమాణాలను ఇందులో పాటించలేదు. ఎగుమతి ఉత్పత్తులపై పన్ను, సుంకాల రాయితీపై రాజ్యసభ స్థాయీ సంఘం ఇచ్చిన కొన్ని సూచనల్ని కూడా పరిగణలోకి తీసుకోలేదు.

**ఎఫ్‌టీపీలోని కొన్ని ముఖ్యాంశాలు:**

- రూపాయిని అంతర్జాతీయ కరెన్సీగా మార్చటం, ఇ–కామర్స్ ఎగుమతులకూ ప్రయోజనాలను వర్తింపచేయటం కొత్త ఎఫ్‌టీపీ ప్రధాన ఉద్దేశాలుగా ఉన్నాయి. రాష్ట్రాలు, జిల్లాల్లోని ఎగుమతిదార్లు, విదేశాల్లోని భారతీయ రాయబారుల మధ్య పరస్పర సహకారాన్ని ప్రోత్సహించటం, లావాదేవీల వ్యయాలు

# రాష్ట్ర, జిల్లాల స్థాయిలో ప్రస్తుత ఎగుమతుల తీరు

రాష్ట్ర, జిల్లాల స్థాయిలో ప్రస్తుత ఎగుమతుల తీరును అవగాహన చేసుకోవడం చాలా అవసరం. 2021-22లో భారత్ రికార్డు స్థాయిలో సుమారు నలభై వేల కోట్ల డాలర్లకుపైగా విలువైన వస్తూత్పత్తులను ఎగుమతి చేసింది. ఇది 2020-21 కన్నా నలభై శాతానికిపైగా అధికం. అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల పరంగా అయిదో స్థానంలో ఉన్న భారత్‌కు ఈ ఎగుమతులు తక్కువేనని భావించాలి. దేశ జీడీపీకి, పెరిగిన ఎగుమతులకు చైనా లాంటి దేశాలతో పోలిస్తే ఎక్కడా పొంతన ఉండటం లేదు. భారత్ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సమాహారం. రాష్ట్రాల తీరైన పురోగతితోనే దేశ ఆర్థిక అభివృద్ధి మెరుగవుతుంది. దేశ ఎగుమతుల తీరుతెన్నులు తెలుసుకోవాలంటే దేశ మొత్తం ఎగుమతుల్లో రాష్ట్రాలు ఎలాంటి పాత్ర పోషిస్తున్నాయనేది అర్థం చేసుకోవడం చాలా అవసరం. ఎందుకంటే అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఎగుమతుల మొత్తమే దేశం ఎగుమతుల మొత్తమే దేశం ఎగుమతులవుతాయి. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను పరిశీలిస్తే మొత్తం ఎగుమతులలో సింహభాగాన్ని కేవలం పది రాష్ట్రాలే సాధిస్తున్నాయి. వీటిలో అత్యధికంగా అయిదు రాష్ట్రాలే అధిక వాటా పొందుతున్నాయి. ఇందులో గుజరాత్ 30.05 శాతం, మహారాష్ట్ర 17.33 శాతం, తమిళనాడు 8.33 శాతం, కర్ణాటక 6.33 శాతం, ఉత్తరప్రదేశ్ 4.98 శాతంతో ఎగుమతుల్లో కీలకంగా నిలుస్తున్నాయి. ఉత్తరప్రదేశ్ మినహా మిగిలిన నాలుగు రాష్ట్రాలలో రెండు దక్షిణాది రాష్ట్రాలు, మిగిలిన రెండూ పశ్చిమ రాష్ట్రాలు. ఈ నాలుగు రాష్ట్రాలకు ఉన్న సుదీర్ఘ సముద్రతీరం ఒక విధంగా ఎగుమతుల పెరుగుదలకు సానుకూల వాతావరణాన్ని కల్పిస్తూ తోడ్పాటు అందిస్తోంది.

జిల్లాల మధ్య వ్యత్యాసాలు

జిల్లా స్థాయి ఎగుమతుల్ని పరిశీలిస్తే- జిల్లాల మధ్య చాలా వ్యత్యాసాలు, అసమానతలు కనిపిస్తున్నాయి. దేశవ్యాప్తంగా కేవలం పది శాతం జిల్లాలు మాత్రమే మొత్తం దేశ ఎగుమతుల ఆదాయంలో 85 శాతాన్ని సమకూరుస్తున్నాయి. ఇందులో ఇరవై జిల్లాలు అయిదు వందల కోట్ల డాలర్లకు పైగా విలువ చేసే వస్తువులను ఎగుమతి చేస్తున్నాయి. ఎగుమతుల మొత్తం ఆదాయంలో వీటి వాటా సగం కన్నా అధికం. ముఖ్యంగా గుజరాత్‌లోని ఆరు జిల్లాలు మొదటి స్థానంలో, మహారాష్ట్రలోని అయిదు జిల్లాలు రెండో స్థానంలో, తమిళనాడు, కర్ణాటక, ఉత్తరప్రదేశ్‌లలోని జిల్లాలు మూడో స్థానంలో నిలిచాయి. మరోవైపు, దేశంలోని 82 జిల్లాలు మాత్రం ఎగుమతుల క్రతువులో భాగస్వామ్యం పొందలేకపోవడం గమనార్హం. ఈ జిల్లాల నుంచి ఏమాత్రం ఎగుమతులు ఉండటం లేదు. అత్యధికంగా ఎగుమతుల ఆదాయాన్ని తెచ్చిపెట్టే వాటిలో జామ్‌నగర్, సూరత్, ముంబయి, పూణె, భరూచ్, కాంచీపురం, అహ్మదాబాద్, గౌతమ్‌బుద్ధనగర్ వంటి తొమ్మిది జిల్లాలు ముందువరసలో ఉన్నాయి. ఈ జిల్లాల నుంచి ఎగుమతయ్యే వస్తువుల్లో ఖనిజ ఇంధనాలు, ఖనిజ ఉత్పత్తులు, రత్నాలు, వజ్రాలు, లోహాలు, అణు రియాక్టర్లు, బాయిలర్లు, యంత్రాలు, యంత్ర సామాగ్రి, రహదారి వాహనాలు, వాటి విడిభాగాలు, మందులు, విద్యుత్తు యంత్రాలు, పరికరాలు వాటి విడిభాగాలు ముఖ్యమైనవి. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం జిల్లా నుంచి ఆర్గానిక్ కెమికల్స్ ఎగుమతులతో ఆదాయం సమకూరుతోంది.

- ప్రొఫెసర్ బి.రామకృష్ణారావు, విశ్రాంత ఆచార్యులు, ఆంధ్రా యూనివర్సిటీ

తగ్గించటం, మరిన్ని అభివృద్ధి కేంద్రాల వృద్ధికి ఇందులో ప్రాధాన్యమిచ్చారు.

- రంగాలవారీగా దేశీయ ఉత్పత్తులను, సేవలను ప్రపంచానికి చేరువ చేయాలనే ప్రధాన లక్ష్యంతో ముందుకెళ్తున్నట్లు పేర్కొంది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మన వస్తు సేవల ఎగుమతులు 765 బిలియన్ డాలర్ల విలువను అధిగమించే అవకాశం ఉందని డీజీఎఫ్‌టీ (ఫారిన్ ట్రేడ్ డైరెక్టర్ జనరల్) తెలిపింది. 2021–22లో ఇవి 676 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

**అంతర్జాతీయ కరెన్సీగా రూపాయి..**

మన రూపాయిని అంతర్జాతీయ కరెన్సీగా మార్చే ఉద్దేశంతో, రూపాయల్లో వాణిజ్య చెల్లింపులకు అనుమతినిచ్చేలా ఎఫ్‌టీపీలో మార్పులు చేశారు. కరెన్సీ సంక్షోభాలు లేదా డాలర్ల కొరత ఎదుర్కొంటున్న దేశాలతో రూపాయల్లో వాణిజ్యాన్ని జరిపేందుకు భారత్ సిద్ధంగా ఉందని ప్రభుత్వం ప్రకటించింది. మన ఎగుమతిదార్లు అంతర్జాతీయంగా పోటీ సామర్థ్యాన్ని పెంచుకోవాలని, అప్పుడు రాయితీలపై ఆధారపడాల్సిన అవసరం ఉండదని పేర్కొంది. రాయితీలు, ప్రోత్సాహకాలపై మాత్రమే పరిశ్రమ విజయం ఆధారపడి ఉంటుందని ప్రభుత్వం తెలిపింది.

**200-300 బి.డాలర్లకు ఇ-కామర్స్ ఎగుమతులు**

2030 కల్లా ఇ–కామర్స్ ఎగుమతులు 200–300 బిలియన్ డాలర్లకు చేరే అవకాశం ఉందని ఎఫ్‌టీపీ అంచనా వేసింది. కొరియర్ ద్వారా ఎగుమతుల విలువ పరిమితిని ఒక్కో ప్యాకెట్‌కు

రెట్టింపు చేసి రూ. 10 లక్షలకు పెంచింది. ఇ-కామర్స్ సంస్థలకు సులభ స్టాకింగ్, కస్టమ్స్ అనుమతులు, రిటర్న్‌ల ప్రాసెసింగ్ విషయంలో తోడ్పాటు అందించేందుకు గిడ్డంగుల సదుపాయాలతో నిర్దేశిత జోన్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఎఫ్‌టీపీకి సంబంధించిన దరఖాస్తుల డిజిటలైజేషన్, ఆటోమేటిక్ సిస్టమ్ ఆధారిత అనుమతులు, అడ్వాన్స్ ఆథరైజేషన్ పొడిగింపు/ రీవ్యాలిడేషన్ దరఖాస్తులు ఒక్కరోజులో ప్రాసెసింగ్, వస్త్ర పరిశ్రమకు ప్రత్యేక అడ్వాన్స్ ఆథరైజేషన్ పథకం పొడిగింపు, సగటు ఈవో (ఎక్స్‌పోర్ట్ ఆబ్లిగేషన్) నిర్వహణ నుంచి పాడి పరిశ్రమకు మినహాయింపు లాంటివీ కొత్త ఎఫ్‌టీపీలో చేర్చారు.

◆

### మీ సెల్ఫీ ఛాలెంజ్‌లు మాకెందుకండీ..

# సమస్యలు పరిష్కరించండి

బొబ్బిలిలో గత కొద్దిరోజులుగా అధికార వైకాపా, ప్రధాన ప్రతిపక్షం తెదేపాల మధ్య సెల్ఫీ ఛాలెంజ్ అంటూ సామాజిక, ప్రచార మాధ్యమాల్లో తెగ హడావుడి చేస్తున్నారని, ఆర్భాటం తప్ప దీని వల్ల ప్రజలకు ప్రయోజనం లేదని లోక్‌సత్తా పార్టీ ఏపీ రాష్ట్ర ప్రతినిధి ఆకుల దామోదరరావు అన్నారు. బొబ్బిలి నియోజకవర్గం గత పంతొమ్మిది సంవత్సరాలుగా మౌలిక వసతుల్లో, అభివృద్ధిలో వెనుకబడి ఉందని, ఇందుకు కారణం ప్రస్తుత అధికార, ప్రతిపక్ష పార్టీలేనన్నారు. బొబ్బిలి-బలిజపేట రహదారి విస్తరణలో అరవై శాతం పూర్తి చేయటానికి తెలుగుదేశంవారికి పదిహేను సంవత్సరాలు పట్టిందన్నారు. తెదేపా హయాంలో పరిశ్రమలు మూతపడటం ప్రారంభం కాగా, ప్రస్తుత పాలక పార్టీ రాజకీయాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మార్చేసిందన్నారు. ఏ రహదారి చూసినా ఏమున్నది గర్వకారణం అన్నట్టుందన్నారు. వైకాపా, తెదేపా రెండు పార్టీలకీ జెండాలు వేరు తప్ప ఎజెండా ఒకటేనని, మూతపడ్డ పరిశ్రమలు, నాయకుల వ్యాపార సంస్థల ముందు సెల్ఫీలు తీసుకోవాలని దామోదరరావు సవాలు చేశారు.

### కొఠియా వివాదంపై

# ముఖ్యమంత్రి స్పందించాలి

ఆంధ్రప్రదేశ్, ఒడిషా సరిహద్దు ప్రాంతాల్లోని వివాదాస్పద కొఠియా గిరిజనులకి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీరని అన్యాయం చేస్తున్నారని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ విజయనగరం జిల్లా సాలూరులో మీడియాతో మాట్లాడుతూ అన్నారు. గత నెలలో ఒడిషా ఉత్కల్ దివస్‌లో భాగంగా యూనియన్ మంత్రి పట్టుచెన్నూరులో పర్యటిస్తూ, ఏపీ పోలీస్ గోబ్యాక్ అన్నా, ముఖ్యమంత్రి, స్థానిక నేతలు, అధికారులు ఇప్పటి వరకూ స్పందించలేదన్నారు. సుమారు 55 సంవత్సరాలుగా కొఠియా వివాదం నెలకొన్నప్పటికీ, వివాదాస్పద గిరిజన గ్రామాల పంచాయతీ సర్పంచ్‌లు ఏపీలో కొనసాగుతామని రాష్ట్ర ప్రభుత్వానికి గత ఏడాది తీర్మానాలు అందచేశారని గుర్తుచేశారు. యూనియన్ ప్రభుత్వం అంటే భయంతో ఉన్న ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల్లో ఉన్న అపారమైన ఖనిజ సంపద విషయంలో గిరిజనులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఈ విషయంపై తక్షణం స్పందించాలన్నారు.

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## జుగాడ్ 50:50 రాజనీతి!
## నమూనా మార్పు (paradigm shift)

గ్రామస్థాయి నుండీ ఎక్కడికక్కడ ఆర్థికవనరుల వికేంద్రీకరణతో పారదర్శకంగా కంటిఎదుట నిర్వహించే పరిపాలన కావాలంటే - ఓటర్లసాక్షిగా అధికారవికేంద్రీకరణ అమలుపరుస్తూ - మన MLA నియోజక వర్గ స్థాయిలో కూడా "లోసుగులులేనిచట్టబద్ధ సుపరిపాలన" మనచే ఎన్నుకోబడ్డ MLAగారి ద్వారా కూడా నిస్సందేహంగా సాధించుకోవచ్చు. మంచి చట్టాలను నిర్మించి మంచి పాలన అందించడమే MLAల యొక్క రాజ్యాంగబద్ధ ప్రాథమిక కర్తవ్యం.

ప్రస్తుతం ఉభయ తెలుగు రాష్ట్రాలలో G.OMs ల రూపేణా చలామణీలో ఉన్న చట్టాలలో అధికశాతం, వివిధరకాల మెలికలతో రచింపబడి, కొంతమంది లాయర్లతోసహా ఎవరికీ అర్థంకాక, చివరికి "ఊఁ అంటావా" మావా "ఊఁ ఊఁ అంటావా" అన్న తరహాలో న్యాయమేదో నిర్ధారించే బాధ్యతనంతా జడ్జీగారిమీదకి నెట్టేస్తున్నాయి. జిల్లా కోర్టులో వచ్చే తీర్పు హైకోర్టులోనూ, ఆతరువాత, సుప్రీంకోర్టు లోనూ సవాలు చేసే అవకాశం రాజ్యాంగమే కల్పించడంతో న్యాయానికి అర్థమే మారిపోతోంది.

నాలుగురాళ్లు వెనకేసుకున్న ప్రతీ ధనిక ఓటరూ తనకునచ్చిన "ఏదో అత్యంతరహస్య కాంక్షతో" ఒకవందమంది అమాయకపు ఓటర్లను చేరదీసి, వారితో పార్టీనిపెట్టుకుని, సామాజిక న్యాయం, సత్వర న్యాయం, హక్కులకై న్యాయపోరాటం అంటూ ఇష్టారాజ్యంగా రోడ్లపైకెక్కి "We want justice" అనే నినాదంతో మనరాజ్యాంగాన్ని సైతం ఖాతరు చేయకుండా అరాచకం సృష్టించి, రాజ్యాధికారాన్నీ రాజ్య ఆర్థిక వనరులనీ అయిదేళ్లపాటు సొంతం చేసుకుంటూపోతే అంతెక్కడ? ఆలోచించండి! ఇటువంటి వ్యవస్థలో నమూనామార్పు ఎంతత్వరగా వస్తే భవిష్య తరాలకు అంత మంచిది !

**నమూనా మార్పు (paradigm shift) అంటేఏమిటి?:** కనీసం 100 మంది జుగాడ్ ఓటర్లే తమ కష్టార్జితమైన రూ. 2వేలు, లేదా రూ. 5వేలు, గరిష్టంగా రూ.10వేలు ఒకేఒకమారు విరాళమిచ్చి పార్టీని విలువలతోకూడిన "నమ్మకంపై ఆధారపడిన పరస్పర సహకారం" అనే ప్రాతిపదికపై నిర్మించుకుంటారు. విరాళంతో పాటు ఒక నిర్మాణాత్మకమైన సలహాకూడా ఇస్తారు. అధినేత రహిత-సమిష్టి నాయకత్వంలో జుగాడ్ పార్టీకి పేరు /Agenda ఓటర్లే నిర్ణయిస్తారు. జుగాడ్ ఓటర్ల "మెజారిటీ-ఓటు" ప్రకారం పార్టీ నిర్వహించబడుతుంది. MLA/ MP గా పోటీచేయదలచిన మన కార్యకర్తలలో ఒకరిని ప్రత్యక్ష్యంగానో లేదా దామాషా పద్ధతిలోనో Selection చేసుకుని సార్వత్రిక Election లో రహస్యంగా ఓట్ వేద్దాం. గెలిచిందెవరైనా వారి పనితీరుపై జుగాడ్ ఓటర్ల నిఘా ఉండేలా పార్టీ నిర్మితమవుతుంది. ఎక్కడ ఎన్నికలలో ఓడిపోయినా బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా హుందాగా వ్యవహరిద్దాం! అవసరమైతే రాజ్యాంగ సంస్కరణలకు సహకరిద్దాం. నమూనా మార్పు అంటే ఇదే! దీనికిమించిన శాంతియుత మార్గం నేటిదాకా ఇంకొకటిలేదు.రండి! జుగాడ్ ఓటర్ల 50:50 రాజనీతికి స్వాగతం పలకండి

contact: Jugaad Parthasarathy (9866416798) with (1) your MLA Constituency name (2) your name and gender (3) your age (4) your Contact. Cell No:

ADVT

# రాజకీయబంధుులైన మార్కెట్ యార్డులు



రైతుల ఆదాయాన్ని పెంచే బహుముఖ పోరాటంలో భాగంగా 2010 నుంచి పార్టీలకతీతంగా చేపట్టిన రైతు చైతన్య యాత్రలో భాగంగా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తెలుగునాట పలు మార్కెట్ యార్డులను సందర్శించారు. యార్డుల్లో రాజకీయ పెత్తనం లేకుండా నిర్వహణను పూర్తిగా రైతులకే అప్పచెప్పాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యుడిగా ఈ అంశాన్ని అసెంబ్లీలోనూ లేవనెత్తారు. ఆ తర్వాత 2014లో రాష్ట్ర విభజన జరిగింది. కానీ ఇప్పటికీ రాజకీయ జోక్యం నుంచి మార్కెట్ యార్డులకు విముక్తి దొరక్కపోగా, రాజకీయ పెత్తనం ఇంకా పెరిగింది.

మార్కెట్ యార్డులతో సంబంధం లేకుండా రైతులు ఎక్కడైనా పంట విక్రయించుకునే స్వేచ్ఛ, వీలైనంత ఎక్కువ ధర పొందే అవకాశం కల్పిస్తూ 2020లో యూనియన్ ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవసాయ చట్ట సవరణల్ని తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకించటానికి మార్కెట్ యార్డులపై రాజకీయ పెత్తనం పోతుందన్న భయం కూడా ఒక కారణం. ఆ చట్టాల వల్ల రైతులకు ఆదాయం పెరుగుతుందని స్పష్టంగా అర్థమవుతున్నా, రాజకీయ కారణాలతో రైతుల్ని రెచ్చగొట్టారు. ఈ రకమైన పెత్తందారీ కారణాలతోనే ఢిల్లీ సరిహద్దుల వద్ద ఆందోళనలు నిర్వహించిన పంజాబ్ తదితర రాష్ట్రాల రైతులకు మద్దతిచ్చారు. చివరికి ఎన్నికల రాజకీయ కారణాలతో మోదీ ప్రభుత్వం వ్యవసాయ చట్ట సవరణల్ని రద్దు చేసింది.

ఈ రకంగా అటు మార్కెట్ యార్డుల్లోనూ రైతులకు యాజమాన్యం లేకుండా, ఇటు మార్కెట్ యార్డులతో సంబంధం లేకుండా ఎక్కడైనా స్వేచ్ఛగా అమ్ముకోకుండా రైతులను నియంత్రిస్తున్నారు.

మార్కెట్‌యార్డుల్లో రైతుల యాజమాన్యం వల్ల వారికి పంట ఉత్పత్తుల అమ్మకాల్లో రేటు విషయంలో పారదర్శకతతోపాటు, ఆ పంటను తనఖా పెట్టుకుని రుణం (ప్లెడ్జి లోన్) తీసుకునే రైతుబంధు వంటి పథకాల్ని సమర్థంగా అమలు చేసుకునే అవకాశం లభిస్తుంది. బ్యాంకుల మీదే ఆధారపడకుండా, పంట ఉత్పత్తుల అమ్మకాలపై మార్కెట్ కమిటీలకు తాము చెల్లించే రుసుములను రైతులు ఇందుకోసం వినియోగించుకోవచ్చు.

ప్లెడ్జి లోన్ కోసం 1982లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పథకాన్ని తీసుకొచ్చారు. 1995లో దీనికి రైతుబంధుగా పేరు మార్చారు. విత్తనం వేసే సమయంలో ధరలు అధికంగా ఉన్నా.. పంట చేతికొచ్చే సమయానికి పడిపోతుంటాయి. అప్పుడు పంటను తెగనమ్ముకోకుండా, మార్కెట్ కమిటీ పరిధిలోని గోదాముల్లో నిల్వ చేసుకుని దానిపై రుణం తీసుకునే వెసులుబాటు ఈ పథకం ద్వారా లభిస్తుంది. ధర బాగున్నప్పుడు అమ్ముకుని రుణం తీర్చేయొచ్చు. రైతుబంధు పథకం ద్వారా మార్కెట్ కమిటీ గోదాముల్లో రైతులు నిల్వ చేసిన పంట ఉత్పత్తులపై 75% విలువ మేర గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు రుణం ఇస్తారు. దీనిపై 180 రోజుల వరకు వడ్డీ ఉండదు. ఆరు



రైతు చైతన్య యాత్రలో భాగంగా జయప్రకాష్ నారాయణ్ 2011లో కోదాడ మండలం గణపవరం, చిలుకూరు, హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డలో ఐకేపీ కేంద్రాలను, హుజూర్‌నగర్, అవంతీపురంలలో మార్కెట్ యార్డులను సందర్శించిన సందర్భంగా ఓ దృశ్యం.

# 2011 నుంచి 2023.. తెలంగాణ మార్కెట్ యార్డుల్లో అదే దుస్థితి

ఏటా వందల కోట్ల చొప్పున కొన్ని వేల కోట్ల రూపాయల మార్కెట్ సెస్సుని రైతుల నుంచి వసూలు చేసినా రాష్ట్ర ప్రభుత్వం ఆ డబ్బుని రైతులకు మార్కెట్ సౌకర్యాల్ని మెరుగుపరిచేందుకు కాకుండా దారిమళ్లించటం వల్లే వర్షాలకు తెలంగాణ ప్రాంతంలోని పలుమార్కెట్ యార్డులు అధ్వాన్నంగా తయారై పంట ఉత్పత్తులు నీటిపాలై రైతులు అల్లాడుతున్నారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ 2010 నుంచి నిర్వహించిన రైతు చైతన్య యాత్రలో పలుమార్లు ప్రభుత్వాల్ని హెచ్చరించారు. ఆ యాత్రలో భాగంగా ఆయన తెలంగాణలోని పలు మార్కెట్ యార్డుల్ని సందర్శించి రైతుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. సిద్దిపేటలో మార్కెట్ యార్డును తెరిపించి రైతులకు తక్షణం ప్రవేశం కల్పించారు.

వర్షాల వల్ల మార్కెట్ యార్డుల్లో రైతులు పడుతున్న ఇబ్బందులపై 2013, అక్టోబర్ 24న మీడియాకు విడుదల చేసిన ఓ నోట్‌లో జేపీ పేర్కొన్న అంశాలివి:

“తెలంగాణ ప్రాంతంలో పంటను అమ్ముకునేందుకు మార్కెట్‌యార్డులకి తీసుకొచ్చిన మహిళలు సహా చిన్న రైతులు యార్డులలో సౌకర్యాలు లేక రోజుల తరబడి ఇబ్బందులు ఎదుర్కోవటాన్ని రైతు చైతన్య యాత్రలలో స్వయంగా చూశాను. మెదక్, నిజామాబాద్‌లో ఉన్న యార్డులలో మహిళలకు మరుగుదొడ్లు కూడా లేవు. పందికొక్కులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇప్పుడు వర్షాలు కూడా



మార్కెట్ యార్డుల్లో వసతుల కరవు

- పంట ఉత్పత్తులన్నీ ఆరుబయటే నిల్వచేసుకోవాల్సిన దుస్థితి
- చిన్న వాన కురిసినా తడవాల్సిందే
- భారీ వర్షం కురిస్తే ఆశలు వదులుకోవాల్సిందే..

వర్షాలపై సన్నద్ధత ఏదీ?

2023 ఏప్రిల్‌లో కురిసిన వర్షానికి మొక్కజొన్న పంటను కాపాడుకోవటానికి నర్సంపేట మార్కెట్ యార్డులో తంటాలు పడుతున్న రైతు

తోడవటంతో యార్డులకొచ్చిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

మార్కెట్ సెస్సు ఉన్నది రైతులకు మంచి రేటు వచ్చేలా మార్కెటింగ్ సదుపాయాల్ని కల్పించటానికి మాత్రమే. ఖజానాలో కలుపుకోవటానికి అదేమీ పన్ను డబ్బు కాదు. మార్కెట్ కమిటీల్ని రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చి రైతులకు ప్రమేయం లేకుండా చేయటంతో ప్రభుత్వం, అధికారుల ఆటలు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. మార్కెట్‌యార్డులలో ప్రహరీగోడలు, మరుగుదొడ్లు, వ్యవసాయోత్పత్తులకు ఆచ్ఛాదనలు, పారిశుద్ధ్యం ఏర్పాట్లు,

తూనిక యంత్రాలను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలి.

అలాగే భారీ వర్షాల వల్ల సీమాంధ్రలోని వివిధ జిల్లాలలో పత్తి పంటదశలోనే దెబ్బతింటోంది. మార్కెట్‌కొచ్చిన పత్తికి సరైన స్టోరేజీ సదుపాయం లేక తడిసిపోవటం వల్ల అసలే అంతంతమాత్రంగా క్వింటాలు రూ. 4,000 – 5,000 ఉన్న ధర రూ. 2,500 – 3,000కి పడిపోయింది. అక్కడ కూడా మార్కెట్ సెస్సును పెద్దఎత్తున వసూలు చేస్తున్నా రైతుల కోసం వినియోగించకుండా పన్నుల్లాగా పులుసులో కలిపేస్తున్నారు. ప్రకృతి ఆగ్రహిస్తే ఆదుకోవాల్సిన ప్రభుత్వమే రైతుల్ని ముంచేలా వ్యవహరించటం దుర్మార్గం. పత్తికి స్టోరేజీ సదుపాయాల్ని, అదే సమయంలో రేటు లేకపోయినా మిర్చి, పసుపు వంటి ఇతర పంటల్ని తెగనమ్ముకోవాల్సిన అవసరం లేకుండా శీతల గిడ్డంగుల్ని ఏర్పాటు చేసి రైతులకు ప్లెడ్జి రుణాల్ని అందించేందుకు వెంటనే ఏర్పాట్లు ప్రారంభించాలి” అన్నారు.

మార్కెట్ యార్డుల దుస్థితిపై, ప్లెడ్జి లోన్లపై జేపీ చెప్పి దశాబ్దం దాటి పోయింది. తెలంగాణ రాష్ట్రం వచ్చింది, రైతులకు ఎంతో లాభం చేస్తున్నామని, ఇదే నమూనాను భారతదేశవ్యాప్తం చేసి ‘అబ్ కీ బార్ కిసాన్ సర్కార్’ అనే నినాదంతో ఎన్నికలను ఎదుర్కొంటామని చెబుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మార్కెట్ యార్డులు ఎలా ఉన్నాయో, ఏప్రిల్, 2023లో పడిన వర్షాలకు రైతులు ఎదుర్కొన్న కడగండ్లను చూస్తే అర్థమవుతుంది. తెలంగాణలో 230 దాకా మార్కెట్ యార్డులున్నాయి. అందులో వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, కేసముద్రం, సూర్యాపేట, జమ్మికుంట వంటి పెద్ద తరహా మార్కెట్ యార్డులకు ఏటా రూ.పది కోట్ల మేర ఆదాయం సమకూరుతోంది. అయినా రైతులకు అవసరమైన మౌలిక వసతుల మీద ఇప్పటికీ దృష్టి సారించలేదు.

నెలల నుంచి తొమ్మిది నెలల వరకు 12% చొప్పున వడ్డీ వసూలు చేస్తారు.

అయితే ఈ పథకాన్ని రాష్ట్ర విభజన జరిగాక పూర్తిగా నీరుగార్చారు. రాష్ట్ర ప్రభుత్వాలు, యూనియన్ ప్రభుత్వం నేరుగా రైతుల ఖాతాలో ఏటా విడతలవారీగా కొంత డబ్బు జమ చేస్తున్నాయి కాబట్టి.. రైతుల పెట్టుబడికి అది చాలన్నట్టు తెలంగాణ, ఏపీ పాలకులు వ్యవహరిస్తున్నారు.

**ఏపీలో రైతుబంధు బంద్**

ఏపీలో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే అరకొరగా రైతుబంధు అమలు చేయగా, వైకాపా ప్రభుత్వం వచ్చాక పూర్తిగా నిలుపుదల చేశారు. 2017-18లో 3,238 మంది రైతులకు రూ. 54.08 కోట్లు, 2018-19లో రూ. 40.51 కోట్ల రుణం ఇచ్చారు. వైకాపా ప్రభుత్వం వచ్చాక తమ పార్టీ నేతల రాజకీయ ఉపాధి కోసం మార్కెట్ కమిటీలను 191 నుంచి 218కి పెంచిన ప్రభుత్వం.. నాలుగేళ్ల నుంచి ఒక్కచోటా రైతులకు రుణం ఇవ్వలేదు. రైతులు ప్రయివేటు వడ్డీ వ్యాపారుల నుంచి రుణాలు తీసుకోకతప్పని పరిస్థితి కల్పించింది. మార్కెట్ కమిటీల్లో ఎమ్మెల్యేలను గౌరవ అధ్యక్షులుగా చేయటం, రైతులు కాకున్నా అధికార పార్టీ వాళ్లయితే పాలకవర్గంలో వేయవచ్చునట్లు వ్యవహరిస్తున్న ప్రభుత్వం.. రైతు సంక్షేమాన్ని గాలికొదిలేసి కనీసం గోదాముల్లో పంట ఉత్పత్తుల నిల్వకూ అవకాశం లేకుండా చేసింది. అద్దెల ద్వారా వచ్చే ఆదాయమే ముఖ్యం అన్నట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

ప్లెడ్జి రుణాల నుంచి ఉత్పత్తుల అమ్మకాలపై ఆంక్షల తొలగింపు వరకు రైతులకు మెరుగైన ఆదాయ మార్గాలు అందుబాటులోకి రానీయకుండా వారిని ఆహారధాన్యాలు, పరిశ్రమలకు ముడి సరకు ఉత్పత్తి చేసేవారుగా, నిరంతరం ప్రభుత్వ సాయం కోసం అర్థించే పరాధీనులుగా, ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తుండటం, ఈ పార్టీ, ఆ పార్టీ అని తేడా లేకుండా ఏ ప్రభుత్వంలోనైనా ఇదే పరిస్థితి కొనసాగటంపై లోతైన అంతర్మథనం లేకుంటే.. భారత్‌కి వచ్చే పాతికేళ్లూ ఎంతో కీలకమైన ఆర్థిక వృద్ధి కూడా మూల్యం చెల్లించే ప్రమాదముంది.

**రైతుబంధుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గతంలో కేటాయించిన నిధులు**

| సంవత్సరం | రైతులు | ఇచ్చిన మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|---|
| 2014-15 | 3,145 | 26.02 |
| 2015-16 | 3,414 | 33.43 |
| 2016-17 | 3,890 | 43.74 |
| 2017-18 | 4,723 | 54.08 |
| 2018-19 | 3,238 | 40.51 |

**ఏపీలో మార్కెట్ కమిటీల ద్వారా వసూలు చేసిన రుసుము**

| సంవత్సరం | మార్కెట్ రుసుము (రూ.కోట్లలో) |
|---|---|
| 2019-20 | 550.34 |
| 2020-21 | 242.49 |
| 2021-22 | 522.56 |
| 2022-23 | 473.00 |

(2023 ఫిబ్రవరి వరకు)

# ఫలితాల్ని ఇచ్చే రీతిలో పోరాటాలు ఉండాలి

## డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్‌తో కటారి ముఖాముఖి (నాలుగో భాగం)

**కటారి:** లోక్‌సత్తా రాజకీయంగా క్రియాశీలకంగా లేకపోయినా జేపీ గారి మాటకు ఓ విలువ ఉంది. హేతుబద్ధంగా చెబుతారు, అంశాల ఆధారంగా చెబుతారు, నిష్పక్షపాతంగా చెబుతారనే భావన ఉంది. రాజకీయపార్టీలు కానీ, టీవీల్లో కానీ మీరు చెప్పిన అంశాలను కొన్ని సందర్భాల్లో కోట్ చేసుకుంటారు..లౌకిక వాదం నుంచి దేశం తప్పుకుంటోంది..ఈ దేశం నాది కాదు అనే భావన ఇటీవల పెరుగుతోంది..ఇలాంటి అంశాలపై మీరు స్పందించడం లేదనే భావన కొంతమందిలో వ్యక్తం అవుతుంది. దీనిపై మీ స్పందన ఏంటి?




**జేపీ:** భారతీయ జనతా పార్టీ తీరులో కొన్ని లోపాలున్నాయి దానిలో అనుమానం లేదు. అన్ని పార్టీల తీరులో లోపాలున్నాయి. ఒకరు రాజకీయాల్ని కులం చుట్టూ తిప్పుతారు, మరొకరు ప్రాంతం చుట్టూ తిప్పుతారు, ఇంకొకరు మతం చుట్టూ తిప్పుతున్నారు. ఇవన్నీ తప్పే. అయితే నాకు భారతీయ సమాజం పట్ల అపారమైన విశ్వాసం ఉంది. వాస్తవాల ఆధారంగా. మనం అంతగొప్పవాళ్లం ఏం కాదు. తప్పులు చేస్తాం. చరిత్రలో ఎన్నోసార్లు తప్పులు చేశాం. ఉద్రేకానికి గురవుతాం. మనం నిజంగా సమాజాన్ని ప్రేమించే వాళ్లం, ఈ సమాజంలో సుహృద్భావ వాతావరణాన్నికోరేవాళ్లం అయితే తిట్టిపోయడం కాకుండా, నేరారోపణలు చేయడం కాకుండా ఈ దాడులు పెరగకుండా చూడడం చాలా ముఖ్యం. నేను నీకంటే సెక్యులర్ అని, నేను నీకంటే సెక్యులర్ అని ప్రజల్లో అదే పనిగా చెప్పుకుంటే ప్రయోజనం లేదు. సమాజంలో వివిధ కారణాల వల్ల రకరకాల భావావేశాలు ఉంటాయి. దాని వెనుకాల సామాజిక, ఆర్థిక, రాజకీయ కారణాలు ఉంటాయి. ఆ లోతుకు వెళ్లి దాన్ని మనం సవరించడం ఎలాగ? ఈ దారిన ఆలోచిస్తున్నవాడిని.. నీ బతుకులో మార్పు తీసుకు రావాల్సిన ప్రయత్నం అవసరం. మనం కూడా అలా కాకుండా అమీతుమీ..బస్తీమే సవాల్ అని చెబితే అసలు రేషనల్‌వాయిస్.. నింపాదిగా ఉండే వాయిస్ ఉండదు. ఆర్ఎస్ఎస్ వాళ్లు పిలిచినా వెళ్లి ఈ తప్పు

జరుగుతుందని బహిరంగా చెప్పగలిగే కొద్దిమందిలో నేనూ ఒకడ్ని. బీజేపీ వాళ్లు పిలిస్తే ఈ ఆరు రంగాల్లో మీరు విఫలం అయ్యారని చెప్పే కొద్దిమందిలో నేనొకడ్ని. కాంగ్రెస్ పిలిస్తే ఇది బాగా చేశారు.. ఇది అధ్వానంగా చేశారు.. పంథా మార్చుకోకుంటే దేశానికి హానికరం అవుతారని చెప్పే కొద్దిమందిలో నేనొకడ్ని. కానీ అరుపులు, కేకలు, పెడబొబ్బలతో చెబితే ప్రయోజనం ఉంటుందా? వాళ్లకు అర్థం అయ్యే రీతిలో, నీ ప్రయోజనమూ దేశ ప్రయోజనాన్ని ఎలా సంధానించాలో దాని ప్రకారం నడిపిస్తే ప్రయోజనం ఉంటుందా? అదే మనం నిర్ణయం చేసుకోవాలి. ఒక్కో మనిషి, ఒక్కో సంస్థ, ఒక్కో ఉద్యమం. అర్థం చేసుకోవాలి. మన దేశంలో నినాదాలు, ఆర్భాటాలు,హంగామా కొంచెం ఎక్కువ. ఉద్రేక స్వభావం ఎక్కువ ఉంది. ఉదాహరణకు కామన్వెల్త్ గేమ్స్.. కొన్ని మెడల్స్ రాగానే హడావుడి మొదలు పెట్టారు. అంతా పూర్తయ్యాక నేనే ఒక ట్వీట్ చేశాను. గెలిచిన వాళ్లకు అభినందనలు.. మనం కనుక మౌలిక సదుపాయాలు కల్పించి శిక్షణ ఇచ్చినట్టయితే సంఖ్య బాగా పెరిగే అవకాశం ఉంది.. ఆ ప్రయత్నం చేద్దామని చెప్పాను. అంతేకానీ హడావుడి డ్రామా చేయక్కర్లేదు. మనదేశంలో కొంచెం హడావుడి ఎక్కువ అయిపోయింది. రెండోది మితవాద పార్టీలు.. ప్రపంచం మొత్తం మీద ఒక సమస్య ఉంది. అతివాదంలో మరో సమస్య ఇది. పెరిగితే నక్సలిజం అవుతుంది. మనదేశంలో సంబంధం లేకుండా వారు మార్క్సిస్ట్ లెనినిస్టు ఇంకేదో మాట్లాడుతుంటారు.. మన దేశ పరిస్థితులకు, మన సమాజానికి, మన ప్రజల జీవితాలకి సంబంధం లేని మాటాలు మాట్లాడుతుంటారు. అది అతివాద పార్టీల సమస్య. మితవాద పార్టీల సమస్య ఏంటి? వాళ్లకు ఉన్న తొలి బలం ఛాందస వర్గాలు. కానీ వారికి పెరిగే బలం సమాజంలో రాజకీయ ప్రభావాన్ని ఇచ్చేది నిజమైన మితవాదం. మితవాదం అంటే ప్రభుత్వ పాత్ర ఎక్కువ ఉండకూడదు. మా జీవితం మీద మీ శాసనం ఎక్కువ ఉండకూడదు. అధికార కేంద్రీకరణ ఉండకూడదు. ఆర్థిక స్వేచ్ఛ ఉండాలి. రాజ్యం.. మొత్తాన్ని కబళించకూడదు.. సమాజం పెద్దది. రాజ్యం ప్రజల అవసరాల కోసం ఉంది.. ఇదీ మితవాదం. రాజ్యమే సమాజం మొత్తాన్ని శాసిస్తుంది..సమాజం మొత్తాన్ని మార్చేస్తుంది..అది వామపక్షవాదం. ఇదీ స్థూలంగా చెప్పాలంటే. ఈ రెండింటిని సమన్వయం చేయడం ఎలాగ? ఛాందసులు లేకపోతే మన ఉనికే ఉండేది కాదు. ఇప్పటికి కూడా మంచో చెడో జెండా మోసేది వాళ్లు. కానీ ఆలోచించే ఈ వర్గం లేకపోతే అసలు రాజకీయం లేదు. ఆ రెండింటిని సమన్వయం చేయడం ఎలా? ఇప్పుడు అమెరికాలో జరిగేది అదే. రిపబ్లికన్ పార్టీ దుర్మార్గపు పార్టీ కాదు. మితవాద పార్టీ. కానీ ఏమైంది ఛాందసవాదం ఇవాళ విజృంభించింది. చివరికి దేశంలో ఏ పని జరగాలన్నా అడ్డుకునే పరిస్థితి వచ్చింది. దేశం అల్లకల్లోలంగా ఉంది. యూరప్‌లో మితవాద పార్టీలు ఈ సమన్వయాన్ని నేర్చుకున్నాయి. జర్మనీలో క్రిస్టియన్ డెమోక్రట్స్ ఉన్నారు.. క్రైస్తవం నుంచి వచ్చినా కూడా ఉదారవాద విలువలు ఆలోచనలు, సాంప్రదాయ ధోరణులు మిళితం చేయగలిగారు. మనదేశంలో ఈ ప్రయోగాలు కొత్తగా జరుగుతున్నాయి. గందరగోళాన్ని మనం అర్థం చేసుకోవాలి. వీటిని సరిదిద్దే ప్రయత్నం చేయాలి తప్ప ప్రతీదాన్ని జీవన్మరణ సమస్యగా చిత్రించకూడదు. 140 కోట్ల జనాభాలో ఎక్కడో ఓ చోట ఏదోఒకటి జరుగుతుంది. టీవీలు, పేపర్లలో చూస్తే నా పిల్లలు అమెరికా వెళ్లకూడదనిపిస్తోంది. ఎందుకని ఎక్కడో చోట తుపాకీతో కాల్చుకుంటున్నారు. అంటే ప్రతీ ఊర్లో, ప్రతీ ఇంట్లో తుపాకీతో కాల్చేసుకుంటారనే భావన మనకు కలుగుతుంది. వాస్తవం అది కాదు.. 24 గంటల న్యూస్‌చానల్స్, సోషల్‌మీడియాలో చూసి మనకు పర్‌స్పెక్టివ్ అనేది పోయింది. ఇది జరగడం లేదని కాదు.. జరుగుతోంది. పర్‌స్పెక్టివ్ కూడా ఉండాలి. లేకపోతే మన వల్ల ప్రయోజనం ఉండదు. అందువల్ల కచ్చితంగా తప్పును మనం ఖండించాలి. నిర్భయంగా నిలబడాలి. అదే సమయంలో సమాజంలో సామాజిక, రాజకీయ అంశాలను అర్థం చేసుకుని నిలబడాలి. అందరూ కూడా తగుదునమ్మా అని అరిచేస్తే పెద్ద ప్రయోజనం ఉండదు. అందుచేత కచ్చితంగా హేతుబద్ధ వాదనలకి, మతాతీతమైన రాజ్యానికి, ఛాందసానికి దూరంగా ఉండాలి. వ్యక్తులుగా మనందరం జీవితాంతం నిలబడ్డ విలువలు అవి. వ్యవస్థగా పోరాడే తీరు ఫలితాలను ఇచ్చే విధంగా ఉండాలి.

(ఇంకా ఉంది. . . )

(గత సంచిక తరువాయి)

# అందరికీ ఆరోగ్యానికి
# ఆచరణసాధ్య నమూనా

**సమర్థవంతం / అందుబాటు / అతి తక్కువ వ్యయం**

## జూలై 2021

(తెలుగులో స్థూల అనువాదం)

(గమనిక: ప్రజలపై ఎటువంటి ఆర్థిక భారం లేకుండా భారతదేశంలో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జీడీపీలో అతి తక్కువ వ్యయంతో అందించేందుకు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నేతృత్వంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) ఇంగ్లీషులో రూపొందించిన సమగ్ర ఆరోగ్య విధానానికి స్థూలంగా తెలుగులో చేసిన అనువాదమిది. ఇందులో పట్టికలు, గణాంక పటాలు, అనెగ్జర్ల వివరాలుండవు. ఆరోగ్య విధానంపై రూపొందించిన పుస్తకంలో పూర్తి సమాచారం ఉంటుంది)



మూడేళ్లలో అమలు చేస్తే, ప్రాథమిక ఆరోగ్యంలో ఏటా 33,000 మంది ఎఫ్.పిలను తీసుకోవచ్చు. ప్రతి సెంటర్‌లోని ఎఫ్.పి క్లినిక్‌ల సంఖ్యను అనుసరించి తదనుగుణంగా అవసరమైన డయాగ్నొస్టిక్ కేంద్రాలు, మందుల డిస్పెన్సరీలను పెంచవచ్చు. మూడేళ్ల తర్వాత, కార్యక్రమ అమలును సమీక్షించవచ్చు. సేవలకు డిమాండ్, నిధుల లభ్యత, సేవలు అందించటానికున్న వ్యవస్థాగత సామర్థ్యాల ప్రాతిపదికన.. నమూనాను విస్తరించవచ్చు. మరింతమంది ఎఫ్.పిలను చేర్చుకోవచ్చు. ద్వితీయ స్థాయి సేవలకు సంబంధించి, క్రమంగా తృతీయ స్థాయి చికిత్సలను అందులో నుండి తొలగించి, మరిన్ని ద్వితీయ స్థాయి చికిత్సలను కలపాలి. తొలుత కార్యక్రమంలోకి చిన్న ప్రయివేటు నర్సింగ్ హోంలను తీసుకురావటమే ప్రాధాన్యంగా ఉండాలి. నమూనా వ్యయ ప్రయోజనాన్ని అంచనా వేసి, క్రమంగా అందరు పౌరులకూ ద్వితీయ స్థాయి చికిత్సలను అందించేలా కార్యక్రమ పరిధిని విస్తరించవచ్చు.

తృతీయ స్థాయి వైద్యంలో మొదటి అంచె (టయర్ 1) ఆస్పత్రుల్లో అన్ని పరికరాలు, వనరులు, నైపుణ్యాలతో దాదాపు 1,40,000 పడకలు అధునాతన తృతీయ స్థాయికి సిద్ధమయ్యేలా, మిగిలిన రెండవ అంచె (టయర్ 2) ఆస్పత్రుల్లోని 1,47,000 పడకలను నాణ్యమైన తృతీయ స్థాయి వైద్యాన్ని అందుబాటు వ్యయంలో అందించేలా సాధానాసంపత్తితో బలోపేతం చేసేందుకు ప్రభుత్వ బోధన, జిల్లా ఆస్పత్రుల్లో మూడేళ్లలో క్రమానుగత పెట్టుబడి పెట్టవచ్చు. మూడేళ్ల చివరినాటికి, ఒక్కో పడక వ్యయం టయర్ 1 ఆస్పత్రుల్లో రూ.25 లక్షలకు, టయర్ 2 తృతీయ స్థాయి వైద్య ఆస్పత్రుల్లో రూ.20 లక్షలకు చేరుతుంది. డిమాండ్ పెరుగుతూ, సేవల నాణ్యత మెరుగుపడుతూ ఉన్నకొద్దీ వ్యయాన్ని, పడకల సంఖ్యను ఇంకా పెంచవచ్చు. ఈ ఏర్పాట్ల అమలుకు మూడేళ్ల కాలవ్యవధిలో దశలవారీ చర్యల వల్ల ఖజానాపై భారం తగ్గి, వ్యవస్థలు, పద్ధతులు, అవసరమైన పర్యవేక్షణ పద్ధతులకు సమయం లభిస్తుంది, వాస్తవ ఫలితాల ఆధారంగా అమలు సమయంలోనే మూల్యాంకనానికి, మధ్యగత దిద్దుబాటుకు వీలు కలుగుతుంది.

ప్రయివేటు పెట్టుబడులకు తగిన ప్రోత్సాహకాలను, సముచిత నికర లాభం లభించే భరోసాను అందిస్తూ మొత్తం సరికొత్త, అత్యాధునిక సేవలకు కావలసిన నిధుల్ని సమీకరించవచ్చు. ఇది ఆస్పత్రి సేవల అమలులో జాప్యాన్ని తగ్గిస్తుంది, నిధుల కొరతను ఎదుర్కొంటున్న ప్రభుత్వ ఖజానాకు ప్రారంభ పెట్టుబడి భారాన్ని తగ్గిస్తుంది. సేవల నాణ్యతను, వ్యవస్థ విశ్వసనీయతను పెంచేందుకు తృతీయ స్థాయి బోధనాస్పత్రుల్లో పార్ట్-టైమ్ ప్రాతిపదికన పనిచేయటానికి అత్యంత నైపుణ్యం, విశ్వసనీయత గల నిపుణులను ఆకర్షించేందుకు స్వేచ్ఛ, ఉత్తమత, సేవకు-రుసుము ప్రాతిపదికన వెసులుబాటు ఉండే పద్ధతుల్ని వెలువరించాలి. స్థానిక పరిస్థితులను బట్టి, ఆస్పత్రి వైద్యంలో సరళమైన నమూనాలు, కొత్త పోకడలకు అవకాశం ఉండాలి. దీంతోపాటు, సహేతుకమైన సంస్థాగత పద్ధతిని అనుసరించటం వల్ల.. ఇప్పుడున్న నిర్మాణాలు, కార్యక్రమాలను కొత్త రీతులతో సులభంగా సంధానం చేయటం సాధ్యమవుతుంది.

**7.2. యూనియన్, రాష్ట్రాల పాత్ర**

జాతీయ ఆరోగ్య గణాంకాల ప్రకారం, ఆరోగ్యంపై మొత్తం ప్రభుత్వ, ప్రయివేటు వ్యయం 2016-17లో రూ.581023 కోట్లు. జి.డి.పిలో 3.8 శాతం. ఆరోగ్యంపై ప్రభుత్వ వ్యయం టి.హెచ్.ఇలో కేవలం 32 శాతం. ప్రయివేటు వ్యయంలో చాలాభాగం ఓ.ఓ.పి.ఇ రూపంలో ఉంది. ఎప్పుడైనా ఎవరైనా అనారోగ్యం బారిన పడితే ఆ కుటుంబంపై పెనుభారం పడుతోంది.

ఆరోగ్యంపై పెద్దఎత్తున ఓ.ఓ.పి.ఇ వల్ల పడుతున్న భారీ స్థాయి, తరచూ కుంగదీస్తున్న భారం గురించి ఈ పత్రంలోని ఇంతకుముందు అధ్యాయాల్లో ఇప్పటికే చర్చించాం. అలాగే, భారత్‌లో ఆరోగ్యంపై ప్రభుత్వ వ్యయం పెరగాల్సిన అవసరంపై అనేకమంది చెబుతున్నారు. అవసరమైన అదనపు వ్యయానికి నిధులు ఎక్కడి నుండి వస్తాయన్నది కీలక చర్చాంశం. భారత్‌లో ఆరోగ్యంపై ప్రభుత్వ వ్యయం.. యూనియన్, రాష్ట్రాల స్థాయిలో చేసే వ్యయాలుగా ఉంటుంది. రాష్ట్ర స్థాయి వ్యయంలో రాజ్యాంగంలోని ఏడవ షెడ్యూల్‌లో రాష్ట్రాల పరిధిలోకి వచ్చే అంశాలకు సంబంధించి పలు కేంద్ర ప్రాయోజిత పథకాలలో భాగంగా రాష్ట్రాలకు యూనియన్ బదిలీ చేసే నిధులు కూడా ఉంటాయి. ఈ స్కీములు జాతీయ స్థాయి ప్రభుత్వం తన వంతు వాటా చెల్లింపు తరహాలో ఉంటాయి.

ఆరోగ్యం, పారిశుద్ధ్యం, ఆస్పత్రులు, డిస్పెన్సరీలు

రాష్ట్రాల అంశాలు అయినందున, ఆరోగ్యంపై ప్రభుత్వ వ్యయంలో ఎక్కువ భాగం రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఉంటుంది. జాతీయ ఆరోగ్య గణాంకాల ప్రకారం, 2016-17లో ప్రభుత్వ ఆరోగ్య వ్యయం రూ.188010 కోట్లలో.. యూనియన్, రాష్ట్ర ప్రభుత్వాల వాటా వరుసగా 31.4 శాతం, 68.9 శాతం. యూనియన్, రాష్ట్రాల ఆరోగ్య వ్యయ వాటా ఏళ్ల తరబడి అదేరీతిలో కొనసాగుతోందని రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా అధ్యయనం తెలియచేస్తోంది (గణాంక పటం 7.1).

**(గణాంక పటం 7.1: ప్రభుత్వ ఆరోగ్య వ్యయం వివరాలు జి.డి.పి % ప్రకారం)**

అయితే, ఆరోగ్య వ్యయంలో రాష్ట్రాల మధ్య గణనీయమైన అంతరం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. గణాంక పటాలు 7.2, 7.3లు వెల్లడిస్తున్నట్లు, ఆరోగ్యంపై తమ స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి (జి.ఎస్.డి.పి)లో అధిక శాతాన్ని ఖర్చు చేస్తున్నప్పటికీ.. సాపేక్షంగా పేద రాష్ట్రాలు (ఉత్తర ప్రదేశ్, బీహార్, జార్ఖండ్) అధిక తలసరి ఆదాయమున్న రాష్ట్రాల (కేరళ, తమిళనాడు, గుజరాత్)తో పోలిస్తే ఆరోగ్యంపై తక్కువ తలసరి వ్యయాన్ని నమోదు చేస్తున్నాయి.

**(గణాంక పటం 7.2: రాష్ట్రాలవారీ ఆరోగ్య వ్యయం జి.ఎస్.డి.పి % లెక్కన)**

**(గణాంక పటం 7.3: రాష్ట్రాలవారీ తలసరి ఆరోగ్య వ్యయం)**

సేవల అమలుకు నిధులను సమకూర్చటంలో యూనియన్ ప్రభుత్వం ప్రధాన పాత్ర పోషించాలని ప్రతిపాదిత నమూనా లక్షిస్తోంది. యూనియన్ ప్రభుత్వం సారథ్య పాత్ర వహించటం ముఖ్యంగా మూడు కారణాల రీత్యా కీలకమవుతోంది. మొదటిది, దేశంలో ఆరోగ్యాన్ని అందించటంలో అధికశాతం ఆర్థిక భారాన్ని రాష్ట్రాలు ఇప్పటికే భరిస్తున్నాయి (మొత్తం ప్రభుత్వ ఆరోగ్య వ్యయంలో సుమారు 70 శాతం). కాబట్టి, పెరిగిన ఆరోగ్య వ్యయాన్ని యూనియన్ భరించటమంటే.. ఆరోగ్య బాధ్యతను మరింత సమతుల్య రీతిలో పంచుకోవటం అవుతుంది. ప్రభుత్వ ఆరోగ్యంపై యూనియన్ ప్రభుత్వం ప్రస్తుతం జి.డి.పిలో సుమారు 0.35 శాతాన్ని ఖర్చు చేస్తోంది (గణాంక పటం 7.1). ఈ పత్రంలో చేసిన ప్రతిపాదనల వ్యయాన్ని మొత్తంగా భరించినా, యూనియన్ ప్రభుత్వ ఆరోగ్య వ్యయం జి.డి.పిలో 0.9 శాతం లోపు ఉంటుంది. ప్రపంచ ప్రమాణాల ప్రకారం, ఇది అత్యంత తక్కువ మొత్తం కూడా. ఒక్కసారి అన్ని ప్రతిపాదనలనీ పూర్తిగా అమలు చేస్తే, యూనియన్, రాష్ట్రాల మొత్తం వ్యయం జి.డి.పిలో 1.7-1.8 శాతం ఉంటుంది. అయినా కూడా ప్రపంచంలోని అన్ని గణనీయ ఆర్థిక వ్యవస్థల కంటే తక్కువ. రెండోది, భారతీయ రాష్ట్రాల మధ్య ఆదాయ వృద్ధి, సామర్థ్యాలలో, ఆరోగ్య సేవల్లో ఎంతో అసాధారణరీతి అధికస్థాయి అంతరాలు ఉన్నాయి. ప్రతిపాదిత ఆరోగ్య రంగ సంస్కరణలకు నిధులిచ్చే పూర్తి బాధ్యతను రాష్ట్రాలకు మాత్రమే అప్పచెప్పటం వల్ల రాష్ట్రాల మధ్య సిఫార్సుల అమలు, తదనంతర ఆరోగ్య ఫలితాలకు సంబంధించి అదేరకమైన అసమానతలతో కూడిన ఫలితాలు వస్తాయి. మూడోది, కొవిడ్ సంక్షోభం ఎంతో విస్తారంగా తెలియచేసినట్లు, ఆరోగ్య సేవల్ని అందించటంలో వాటి ప్రస్తుత పనితీరుతో సంబంధం లేకుండా, అన్ని రాష్ట్రాల్లో ఆరోగ్య సదుపాయాల్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. కాబట్టి, బలమైన ఆరోగ్య వ్యవస్థకు ఒక ఉమ్మడి, జాతీయ, పునాది నమూనా అవసరం. కాబట్టి, దేశంలోని ఆరోగ్య వ్యవస్థను పునరుత్తేజితం చేసి, బలోపేతం చేసే ప్రయత్నానికి జాతీయ స్థాయి ప్రభుత్వమే సారథ్యం వహించాలి.

ఈ సంస్కరణల సందర్భంలో యూనియన్ సారథ్యాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉన్నప్పటికీ, ఆరోగ్యం ఆవశ్యకంగా రాష్ట్ర అంశం. రాష్ట్రాలు సంస్కరణల్ని పూర్తిగా సొంతం చేసుకుంటాయి, వాటి అమలుకి బాధ్యులు రాష్ట్రాలే. ఒక్కో ప్రాంత ప్రత్యేక పరిస్థితులు, అవసరాలకనుగుణంగా ఈ నమూనాకు ఏ విధమైన జోడింపులు, సవరణలనైనా రాష్ట్రాలు చేయవచ్చు. నిజానికి, వివిధ రాష్ట్రాలు అన్వయించుకునేందుకు వీలుగా, ఈ నమూనాలోని వివిధ అంశాల నిర్దిష్టతల్లో గరిష్ట స్థాయి వెసులుబాటుకు ప్రతిపాదిత విధానం వీలు కల్పించింది. యూనియన్ నిధులకు అదనంగా నిధులు ఇవ్వటానికి, వాటిని కూడా తాము అవసరమని భావించిన రీతిలో ఇవ్వటానికి రాష్ట్ర ప్రభుత్వాలకు స్వేచ్ఛ ఉంది. ఆరోగ్య సేవలను అందించటం, పర్యవేక్షించటం, పరిశీలించటం, మొత్తం వైద్య సేవలందించేవారికి నేతృత్వం వహించటం ఈ బాధ్యత అంతిమంగా రాష్ట్రాలపైనే ఉంటుంది.

# సిఫార్సుల సారాంశం
# ప్రాథమిక ఆరోగ్యం

| | |
|---|---|
| ఆస్పత్రి సేవలతో అనుసంధానం చేసిన సమగ్ర ఫ్యామిలీ-ఫిజీషియన్ (ఎఫ్.పి) ప్రాథమిక ఆరోగ్య నమూనా | ప్రాథమిక స్థాయి అనారోగ్యాలకు చికిత్స అందించేందుకు, సాధారణ పరీక్షల ద్వారా ఆరోగ్య నిర్వహణకు మొదటగా వైద్యుని సంప్రదించే స్థానం. |
| ఎఫ్.పిల బృందం | 1,00,000-1,50,000 జనాభా కలిగిన చిన్న పట్టణం (ప్రాథమిక ఆరోగ్య సెంటర్)లో 8-10 మంది ఎఫ్.పిల బృందం సేవలను అందించటం.<br><br>ఎంపిక చేసిన ఆ సెంటర్.. చుట్టుపక్కల గ్రామాలకు సహజ ఆర్థిక, సామాజిక కేంద్రం అయ్యుండాలి.<br>ఎఫ్.పి తాను ప్రాక్టీస్ చేస్తున్న ప్రాంతంలో నివసించాలి. తన సొంత క్లినిక్ ఏర్పాటుకు, నిర్వహణకు ఎఫ్.పియే బాధ్యత తీసుకోవాలి. |
| పై స్థాయి వైద్యానికి తొలి సిఫార్సుదారు | మిగిలిన (పై స్థాయి) ఆరోగ్య వ్యవస్థకు ఎఫ్.పి తొలి సిఫార్సుదారు (రెఫరల్ గేట్‌కీపర్)గా వ్యవహరిస్తారు. కేవలం ఎమర్జెన్సీ కేసులు మినహాయించి, ఏ రోగి కూడా ద్వితీయ, తృతీయ సేవలను అందించే ప్రభుత్వాస్పత్రికి ఎఫ్.పి సిఫార్సు లేకుండా వెళ్లరాదు. |
| పోటీ, ఎంపిక | తమ చుట్టుపక్కల ఉన్న ఏ ఎఫ్.పి క్లినిక్ వద్దయినా సేవలను అందుకునే ఎంపిక అవకాశాన్ని ప్రజలకు అందించటం ద్వారా ఎఫ్.పిల మధ్య పోటీని ప్రోత్సహిస్తారు.<br>నాణ్యత, జవాబుదారీతనం ఉండేలా.. రోగి నుండి సంప్రదింపు (కన్సల్టేషన్) ప్రాతిపదికన ప్రతి ఎఫ్.పికి నిర్దిష్ట మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తుంది. |
| ఆరోగ్య రికార్డుల వ్యవస్థ | ఒక వ్యక్తి వైద్య చరిత్రకు సంబంధించి సమాచారాన్ని సమర్థవంతంగా డిజిటల్ సేకరణ చేయటం, భద్రపరచటం. |
| ఎఫ్.పి కన్సల్టేషన్‌కి సహ చెల్లింపు | మెరుగైన సేవలను డిమాండ్ చేయగలిగేలా, అనవసర చికిత్సను నివారించేలా ప్రతి ఎఫ్.పి సంప్రదింపుకీ రోగి నుండి రూ.25 నామమాత్రపు ఫీజుని వసూలు చేస్తారు. నిరుపేదలకు, రోగుల్లో 10% మేర ఎఫ్‌పి విచక్షణను అనుసరించి మినహాయింపు ఉంటుంది. |
| ఫ్యామిలీ ఆరోగ్య సేవల్లో శిక్షణ | కమ్యూనిటీ అవసరాలకనుగుణంగా మార్చుకోగలిగేలా, వైద్య గ్రాడ్యుయేట్లకి 1-3 నెలలపాటు చిన్న స్థాయిలో, పకడ్బందీగా రూపొందించిన శిక్షణా కార్యక్రమాలు. |
| ప్రభుత్వ ఆరోగ్య సేవలతో సంధానం | ప్రభుత్వ ఆరోగ్య సేవలతో సంధానం ఉండేలా, స్థానిక పి.హెచ్.సిలతో ఎఫ్.పి క్లినిక్‌లు సమీప సమన్వయంతో పనిచేస్తాయి. అయితే ఎవరి పాత్ర వారికి స్పష్టంగా విభజించి ఉంటుంది. |

(ఇంకా ఉంది...)









### డబ్బులు పంచుతున్నా చదువు రావట్లే..

# ప్రభుత్వాలు కళ్లు తెరవాలి: జేపీ

ఉపాధ్యాయులకు లక్షల కోట్ల జీతాలిస్తున్నా, వివిధ పథకాల పేరుతో డబ్బులు బట్వాడా చేస్తున్నా, భీకరంగా హూంకరిస్తున్నా స్కూలు పిల్లలకు సరైన చదువు అందటం లేదని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా.జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఈ-అభ్యాస్ అకాడమీ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర స్థాయి ప్రతిభా పురస్కారాల ప్రదాన కార్యక్రమం హైదరాబాద్‌లో నిర్వహించారు. శాంతా బయోటెక్ వ్యవస్థాపకుడు కె.ఎల్ వరప్రసాదరెడ్డితో పాటు జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యలో మన ఘోరవైఫల్యాన్ని తేలిగ్గా మార్చే అవకాశాలు ఇప్పుడు మనకు అందుబాటులో ఉన్నాయని, అందుకే ఈ రంగంలో తనకు ఆశావాదం ఉందన్నారు. 26 కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వాలు కళ్లు తెరిచి పాఠశాల విద్యలో మౌలిక అంశాలలో మార్పులు తేవాలని జేపీ విజ్ఞప్తి చేశారు. ఈ-అభ్యాస్ చైర్మన్ ఫణి పవన్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.





RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2021-2023 Published on 10th May, 2023 Posting Date 15 &16th of every month





## నిమిషానికి 100 మందిని పేదలుగా మారుస్తున్న

# ప్రభుత్వ ఆరోగ్య విధానం

వైద్య అవసరాల కోసం ప్రజలు తమ జేబుల్లో నుంచి చేసే ఖర్చు తగ్గి, ఆరోగ్య రంగంలో ప్రభుత్వ వ్యయం పెరిగిందని జాతీయ ఆరోగ్య ఖర్చుల అంచనాలు పేర్కొంటున్నప్పటికీ.. అనారోగ్యం వల్ల కుటుంబాలపై పడుతున్న ఆర్థిక భారం ఇప్పటికీ పలు దేశాల్లో కంటే భారత్‌లోనే అత్యధికం. ఆరోగ్య రంగంపై ప్రభుత్వ వ్యయం కూడా అత్యల్పం. కేవలం ఆరోగ్య విధానంలో ప్రభుత్వాల వైఫల్యం వల్ల రోజుకు లక్షన్నర మంది, గంటకు 6-7,000 మంది, నిమిషానికి 100 మంది మన దేశంలో పేదలుగా మారుతున్నారు. ఉత్పాదక శక్తి బాగా తక్కువగా ఉంటోంది. దేశంలో యువ జనాభా అధికంగా ఉన్నా జీవనశైలి వ్యాధులు పెరుగుతూ భవిష్యత్తు భారతం పట్ల భయాల్ని పెంచుతున్నాయి. ఔషధాలు, టీకాల రంగం, వైద్య నైపుణ్యాలు, సాంకేతిక వనరులు వంటి మనకున్న బలాల్ని ఈ సంక్షోభాన్ని చక్కదిద్దేందుకు కాకుండా.. తాత్కాలిక పథకాలతో ప్రజలను మభ్యపెట్టటానికి, ప్రయివేటు రంగానికి, విదేశీ రోగులకు ఉపయోగపడటానికి మాత్రమే ప్రభుత్వాలు ఉపయోగిస్తూ కాలయాపన చేస్తున్నాయి. దీనివల్ల ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ వంటి పథకాలున్నా ప్రజలకు ఆరోగ్యం అందటం లేదు. తలకిందులుగా ఉన్న మన ఆరోగ్య వ్యవస్థను బాగుచేయటం తేలిగ్గా, తక్కువ ఖర్చుతోనే సాధ్యం. ఆరోగ్య సంక్షోభాన్ని పరిష్కరించే సమగ్ర విధానాన్ని అమలు చేయకుండా దేశ ప్రజల జీవితాల్ని ప్రభుత్వాలు బాగు చేయలేవు.

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**